# ప్రజాభూమి
Prajabhoomi Telugu Daily
www.prajabhoomi.com






ప్రజాభూమి దినపత్రిక పాఠకులకు, ప్రకటన కర్తలకు, శ్రేయోభిలాషులకు సంక్రాంతి శుభాకాంక్షలు



తెలంగాణ ఎడిటర్ విప్పల చంద్రశేఖర్ | మంగళవారం | 13.01.2025 | పేజీలు : 08 | నమూన సంచిక | వెల : అమూల్యం


# ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నాం

- మంచి పనులు చేసి శభాష్ అనిపించుకుంటాం
- సాగునీటి సమస్యలను తీర్చేలా కార్యాచరణ
- పది నియోజకవర్గాలకు నీరందించే బాధ్యత మాదే
- మంత్రులు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క,
- మంచుకొండ ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపన
- పాల్గొన్న మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగిలేటి శ్రీనివాసరెడ్డి

2 లో



## జడ్ మోడ్ సొరంగాన్ని ప్రారంభించిన ప్రధాని మోదీ

- పటిష్ట భద్రతను ఏర్పాటు చేసిన అధికారులు
- జడ్ మోడ్ సొరంగం పొడవు 6.5 కిలోమీటర్ల
- టన్నెల్ నిర్మాణం కోసం ఏకంగా రూ.2,500 కోట్లు ఖర్చు




## పండుగ వేళ అదిరిపోయే న్యూస్..

తెలంగాణలో కొత్త రేషన్ కార్డుల జారీకి మార్గదర్శకాలు..

హైదరాబాద్, ప్రజాభూమి

సంక్రాంతి పండుగ వేళ తెలంగాణలోని రేవంత్ రెడ్డి ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది.. తెలంగాణలో కొత్త రేషన్ కార్డుల మంజూరుకు సంబంధించిన మార్గదర్శకాలను తెలంగాణ ప్రభుత్వం సోమవారం విడుదల చేసింది. గణతంత్ర దినోత్సవం ఈ నెల 26 నుంచి పౌరసరఫరాల మిగతా 2లో...



## కిషన్‌రెడ్డి నివాసంలో ఘనంగా సంక్రాంతి వేడుకలు

- ముఖ్య అతిథిగా హాజరైన ప్రధాని మోడీ,స్పీకర్ ఓం బిర్లా
- నటుడు చిరంజీవి, పలువురు కేంద్రమంత్రులు, నేతల రాక




న్యూఢిల్లీ,ప్రజాభూమి:

తెలుగు రాష్ట్రాల్లో సంక్రాంతి సంబరాలు అంబరాన్ని అంటుతున్నాయి. రంగురంగుల రంగవల్లులతో గ్రామాలు, పట్టణాలు ముస్తాబు కాగా.. కోడి పందేలు, ఎడ్ల పందేలతో పండగను ఘనంగా నిర్వహిస్తున్నారు. మరోవైపు కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి ఇంట్లో సంక్రాంతి సంబరాలు హోరెత్తిపోతున్నాయి. దేశ రాజధాని ఢిల్లీలోని ఆయన నివాసంలో సోమవారం సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ వేడుకకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీతోపాటు పలువురు కేంద్ర మంత్రులు, సినీ, రాజకీయ ప్రముఖులు హాజరయ్యారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతిప్రజ్వలన చేశారు. ఈ వేడుకల్లో స్పీకర్ ఓం బిర్లా, కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాసరాజు, సినీనటుడు చిరంజీవి, ఏఐజీ ఆసుపత్రి ఛైర్మన్ డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి, పీవీ సింధు వివిధ రంగాల ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలను మోదీ వీక్షించారు. గాయని సునీత పాటలతో మిగతా 2లో...

## ప్రారంభమైన మహాకుంభమేళా

తొలిరోజే కోటిన్నరమంది పుణ్యస్నానాలు



ప్రయాగ్‌రాజ్,ప్రజాభూమి

ఉత్తరప్రదేశ్‌లోని ప్రయోగ్‌రాజ్ లో ప్రారంభమైన మహా కుంభమేళా కు తొలిరోజే భక్తులు పోటెత్తారు. గంగ, యమున, సరస్వతీ నదుల సంగమంలో 1.50 కోట్ల మంది పవిత్ర స్నానాలు చేశారు. సోమవారంనాడు పుష్య పౌర్ణమి సందర్భంగా బీహార్, హర్యానా, బెంగాల్, ఒడిశా, ఢిల్లీ, ఉత్తరాఖండ్, పంజాబ్, మిగతా 2లో...

## సందడిగా కైట్ ఫెస్టివల్

- మూడు రోజుల పాటు పతంగుల పండగ
- 19 దేశాల నుంచి 47మంది పాల్గొన్న అంతర్జాతీయ కైట్ ఫ్లైయర్స్
- చిన్న పెద్ద తేడా లేకుండా వేడుకల్లో పాల్గొన్న ప్రజలు

2 లో



## ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అరెస్ట్

– ఎమ్మెల్యే సంజయ్‌పై దాడిపై కేసు నమోదు

హైదరాబాద్,ప్రజాభూమి

హుజూరాబాద్ భారాస ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ని కరీంనగర్ పోలీసులు అరెస్టు చేశారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో ఓ న్యూస్ ఛానల్ నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని తిరిగి వెళ్తుండగా 35 మంది పోలీసులు వచ్చి అదుపులోకి తీసుకున్నారు. కౌశిక్‌రెడ్డిని హైదరాబాద్ మిగతా 2లో...



# కిషన్‌రెడ్డి నివాసంలో ఘనంగా సంక్రాంతి వేడుకలు

మొదటిపేజీ తరువాయి

అలరించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీకి వెంకటేశ్వరస్వామి ప్రతిమను కిషన్‌రెడ్డి అందజేశారు. ఎంపీలు లక్ష్మణ్, అనురాగ్ ఠాకూర్, ఈటెల రాజేందర్, ధర్మపురి అరవింద్, రఘునందన్ రావు, లక్ష్మణ్, గోడెం నగేష్, బాలశౌరి, కొండ విశ్వేశ్వర్ రెడ్డి , డి.కె.అరుణ సహా పలువురు తెలంగాణ బీజేపీ నేతలు సైతం వేడుకలో పాల్గొన్నారు. అలాగే లోక్ సభ స్పీకర్ ఓం బిర్లా, హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ, కేంద్ర మంత్రులు గజేంద్ర సింగ్ షెకావత్, జ్యోతి రాధిత్య సింధియా, మనోహర్ లాల్ కట్టర్, పెమ్మసాని చంద్రశేఖర్, బండి సంజయ్, సతీశ్ చంద్ర దూబే, శ్రీనివాస్ వర్మ హాజరయ్యారు. మరోవైపు పలువురు ఎంపీలు, పారిశ్రామికవేత్తలు, బీజేపీ నేతలు కిషన్ రెడ్డి నివాసానికి భారీగా చేరుకున్నారు. కేంద్ర మంత్రి నివాసానికి చేరుకున్న ప్రధాని మోదీకి కిషన్ రెడ్డి, చిరంజీవి, పెమ్మసాని చంద్రశేఖర్ సాదర స్వాగతం పలికారు. సంక్రాంతి వేడుకల నేపథ్యంలో తెలుగు సంప్రదాయం ఉట్టిపడేలా కిషన్ రెడ్డి ఇంటిని ముస్తాబు చేశారు. అతిథులకు తెలుగు వంటలను సైతం రుచి చూపించేలా పలు వంటకాలను సిద్ధం చేశారు.

# ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అరెస్ట్

మొదటిపేజీ తరువాయి

నుంచి కరీంనగర్ తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. ఆదివారం కరీంనగర్ కలెక్టరేట్‌లో రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్‌కార్డుల జారీ సన్నద్ధతపై నిర్వహించిన కార్యక్రమంలో డాక్టర్ సంజయ్ మాట్లాడే సమయంలో.. ఆయన పక్కనే కూర్చున్న కౌశిక్‌రెడ్డి లేచి అభ్యంతరం తెలిపారు. 'ఈయనకు మైకు ఇవ్వొద్దు.. నువ్వు ఏ పార్టీవయా..?' అంటూ వేలెత్తి చూపిస్తూ మాటల దాడికి దిగారు. దీంతో డాక్టర్ సంజయ్ 'నీకేం సంబంధం.. నాది కాంగ్రెస్ పార్టీ.. నువ్వు కూర్చో' అన్నారు. ఈ క్రమంలో వాగ్వాదం పెరిగింది. ఒక దశలో సంజయ్ చేతిని కౌశిక్‌రెడ్డి తోసేశారు. అనంతరం కౌశిక్‌రెడ్డి పరుష పదజాలం వాడటంతో గొడవ పెద్దదై పరస్పరం తోసుకునే స్థాయికి చేరింది. అనూహ్య పరిణామానికి వేదికపై ఉన్న మంత్రులతో పాటు ప్రజాప్రతినిధులు నిర్ఘాంతపోయారు. పక్కనే ఉన్న రామగుండం, పెద్దపల్లి ఎమ్మెల్యేలు మక్కాన్‌సింగ్, విజయరమణారావులు వారించే యత్నం చేసినా కౌశిక్‌రెడ్డి వినలేదు. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు పోలీసులు ఆయనను బలవంతంగా సమావేశం నుంచి బయటకు తీసుకెళ్లారు. ఈ ఘటనపై కరీంనగర్ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఎమ్మెల్యే సంజయ్ ఫిర్యాదు మేరకు కౌశిక్‌రెడ్డిపై పోలీసులు కేసు నమోదు చేశారు. సమావేశంలో గందరగోళం, పక్కదారి పట్టించారని ఆర్డీవో మహేశ్వర్ ఫిర్యాదు మేరకు మరో కేసు నమోదైంది. తన పట్ల దురుసుగా ప్రవర్తించారని జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ మల్లేశం ఇచ్చిన ఫిర్యాదుపై కౌశిక్‌రెడ్డిపై ఇంకో కేసును ÷ల్ చేశారు. ఈమేరకు వేర్వేరుగా మూడు కేసులను పోలీసులు నమోదు చేశారు.

# సందడిగా కైట్ ఫెస్టివల్

మొదటిపేజీ తరువాయి

సోమవారం సాయంత్రం సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్లో మంత్రులు పొన్న ప్రభాకర్, జూపల్లి కృష్ణారావులు ఈ ఉత్సవాలను ప్రారంభించారు.ప్రతి యేటా రాష్ట్ర ప్రభుత్వం తరపున నిర్వహించే ఇంటర్నేషనల్ కైట్ ఫెస్టివల్ అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. మూడు రోజుల పాటు ఈ పంతంగుల పండుగ జరుగనుంది. మకర సంక్రాంతి సందర్భంగా హైదరాబాద్ లో కలర్ ఫుల్ గా కైట్ ఫెస్టివల్ కొనసాగుతోంది. యువత కైట్స్ ఎగురవేస్తున్నారు. తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలోనూ కైట్ అంట్ స్వీట్ ఫెస్టివల్ జరిగింది. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్ లో జరిగే ఈ ఫెస్టివల్లో 19 దేశాలకు చెందిన 47 మంది అంతర్జాతీయ కైట్ ఫ్లైయర్స్ పాల్గొన్నారు. వివిధ రూపాల్లో ఉన్న పతంగులకు ఎగురవేసి సందడి చేశారు. స్పైడ్ మేన్, స్నేక్స్, బర్డ్స్ రూపాల్లో ఉన్న పతంగులు స్పెషల్ ఎట్రాక్షన్గా నిలిచాయి. మూడు రోజుల పాటు భాగ్య నగరవాసులను ఈ కైట్స్ కనువిందు చేయనున్నాయి. సంక్రాంతి సందర్భంగా రాష్ట్ర టూరిజం, భాషా సంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో కైట్ ఫెస్టివల్ 13 నుంచి జనవరి 15 వరకు మూడు రోజుల పాటు నిర్వహించనున్నారు. ఈ కైట్ ఫెస్టివల్లో ఇండోనేషియా, ఆస్ట్రేలియా వంటి 19 దేశాలనుంచి47 మంది కైట్ ఫ్లైయర్స్ పాల్గొననున్నారు. 14 రాష్ట్రాల నుంచి 54మంది నేషనల్ ప్రొఫెషనల్ కైట్ ఫ్లయర్స్ పాల్గొంటారు. కైట్ ఫెస్టివల్ తో పాటు స్వీట్ ఫెస్టివల్ కూడా నిర్వహిస్తున్నారు. నోరూరించే రకరకాల పిండివంటలు, స్వీట్స్ తో కూడిన వంటకాల స్టాల్స్ ఏర్పాటు చేశారు. దాదాపు 11 వందల వంటకాలు ఇందులో ప్రదర్శించనున్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్, ఐఏఎస్ స్మితా సబర్వాల్, తెలంగాణ టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్మన్ వెన్నెల గద్దర్, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అనర్హులకు ఇళ్లు వస్తే కలెక్టర్లదే బాధ్యత

## - మంత్రి కోమటిరెడ్డి సున్నితంగా హెచ్చరిక




ఖమ్మం, ప్రజాభూమి

అర్హులైన వారికే ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాల్సి ఉందని, భవనాలు ఉన్న వారికి ఇళ్లు ఇస్తే మొదటి బాధ్యులు కలెక్టర్ అవుతారని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. అర్హులైన వారికి ఇళ్లు రావాలన్నారు. అధికారులు, సిబ్బంది కీలక పాత్ర వహించాల్సి వుంటుంది.. అధికారులు, సిబ్బంది అలసత్వం ఉండొద్దు.. గ్రామాలు మీ ఇళ్లు అనుకుని పని చేయండి అని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సూచించారు. జిల్లాలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రజలకు భోగి, సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేస్తూ.. కొంచెం ఇంపా÷-టç÷ంట్ మీటింగ్ కారణంగా ఆలస్యంగా వచ్చానన్నారు. త్వరలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆకస్మిక పర్యటనలు ఉంటాయని తెలిపారు. అక్రమాలు జరుగకుండా చూడాలన్నారు.అలాగే, ప్రజా పాలనలో ప్రజలు ఎంతో ఆశతో, నమ్మకంతో ఈ ప్రభుత్వాన్ని గెలిపించారు అని రోడ్లు, భవనాలు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్? రెడ్డి తెలిపారు. వారి కోసం ఒక్కొక్కటిగా పని చేసి పెడుతున్నాం.. ఇందిరమ్మ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా లాంటి కార్యక్రమాలు జనవరి 26 నుంచి అమలు చేస్తామన్నారు. దీనికి గాను సీఎం రేవంత్ రెడ్డి సమావేశం ఏర్పాటు చేశారు.. దానికి మంత్రులు, అధికారులు అందరు హాజరయ్యారు.. ప్రతి అర్హుడైన పేదవాడికి న్యాయం జరిగేలా ఈ ప్రభుత్వం చూస్తుందన్నారు. అర్హుడైన ప్రతి రైతుకు రైతు భరోసా అందిస్తాం.. రెవెన్యూ మంత్రి కూడ ఖమ్మం జిల్లాకు చెందిన వాడే ఆయన దగ్గర ఉండి మరి మీకు ఇందిరమ్మ ఇళు ్ల ఇస్తారు.. 16 నుంచి 26 వరకు అధికారులు కష్టపడి, ప్రతి గ్రామానికి వెళ్ళి సర్వే చేయాలి.. పేదలకు ఇళ్లు అందేలా చూడాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి వెల్లడించారు.

# ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నాం

ఖమ్మం,ప్రజాభూమి

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో రాబోయే నాలుగేళ్లలో అన్ని ప్రాజెక్టు పనులు పూర్తి చేస్తామని మంత్రులు స్పష్టం చేశారు. సీతారామ పూర్తి చేసి గోదావరి జలాలు.. ఖమ్మం జిల్లాకు తీసుకు వస్తామన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమం లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి అండగా నిలిచిన మీ త్యాగాలు మర్చిపోమని పేర్కొన్నారు. గత ప్రభుత్వం రూ. పది వేల కోట్లు ఖర్చు చేసి ఒక్క ఎకరాకు కూడా సాగునీరు ఇవ్వలేదని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. జూలూరుపాడు టన్నెల్ పూర్తయితే.. పాలేరుకు గోదావరి జలాలు వస్తాయన్నారు. ఖమ్మం జిల్లాలోని 10 అసెంబ్లీ నియోజకవర్గాలు సస్యశ్యామలం చేయాలన్నదే తన రాజకీయ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. అలాగే సీతారామ ప్రాజెక్ట్ పూర్తి కావడంతోపాటు భద్రాచలంకి రైల్వే లైన్, కొత్తగూడెంకు ఎయిర్ పోర్ట్ రావాలన్నారు. మీ కష్టాలు తెలుసు, మీ అవసరాలు సైతం తనకు తెలుసునన్నారు. అన్ని పనులు పూర్తి చేసి.. మీతో శబాష్ అనిపించుకుంటా నని.. అంతే తప్ప. ఛీ ఛీ అని మాత్రం అనిపించుకోనని ఆయన పేర్కొన్నారు. సోమవారం ఖమ్మం జిల్లాలోని రఘునాధపాలెం మండలం మంచుకొండ ఎత్తిపోతల పథకానికి తుమ్మలతోపాటు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఇతర మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగిలేటి శ్రీనివాసరెడ్డి తదితరులు శంకుస్థాపన చేశారు. అనంతరం వరుసగా మంత్రులు మాట్లాడారు. ఆ క్రమంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ఈ ఏడాది సత్తుపల్లి ట్రంక్ పూర్తి చేసి గోదావరి జలాలను పూర్తి చేస్తానని స్పష్టం చేశారు. పామాయిల్ సాగు చేయాలని ఈ సందర్భంగా రైతులకు ఆయన పిలుపు నిచ్చారు. ప్రతి జిల్లాలో పామాయిల్ ఫ్యాక్టరీలు స్థాపించి.. రైతులను రాజులుగా నిలబెట్టే బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వానిదని ఆయన పేర్కొన్నారు. 46 మండలాలకు సాగు నీరు అందించే భాగ్యం తనకు దక్కిందంటూ మంత్రి తుమ్మల ఈ సందర్భంగా సంతోషం వ్యక్తం చేశారు. ఒక్క రఘునాధ పాలెం మండలానికి సాగు నీరు ఇవ్వలేక పోయానన్న బాధ గతంలో ఉండేదని.. ఇప్పుడా ఆ బాధ సైతం తనకు లేదన్నారు. మీరు పామాయిల్ సాగు చేయండి.. ఉగాది నాటికి సాగు నీరు తీసుకు వచ్చి మీ మొక్కలు బతికిస్తాంటూ రైతులకు మంత్రి తుమ్మల భరోసా ఇచ్చారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. ఇందిరమ్మ రాజ్యం వచ్చి ఏడాది పూర్తియిందని గుర్తు చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాలను ఒకోక్కటిగా నెరవేరుస్తున్నామని అన్నారు. ప్రతిపక్షం అవాక్కులు చవాక్కులు పేలినా.. వాటిని పట్టించుకోకుండా అభివృద్ధి, సంక్షేమం కొనసాగిస్తున్నామని తెలిపారు. ప్రతి పేద వాడికి అభివృద్ధి సంక్షేమం అందజేస్తామన్నారు. అలాగే మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ.. 2500 ఎకరాలకు సాగునీరు అందించే ఎత్తిపోతల పథకం పనులు ప్రారంభించటం సంతోషంగా ఉందన్నారు. అపర భగీరధుడు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మీకు మంత్రిగా ఉండటం అదృష్టమని పేర్కొన్నారు. మంత్రులమంతా సమన్వయంతో పని చేస్తున్నామని తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని ఈ సందర్భంగా ప్రజలకు ఆయన విజ్ఞప్తి చేశారు. ఉప ముఖ్య మంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. మంచుకొండ ఎత్తిపోతల ప్రాజెక్ట్ ను తక్కువ ఖర్చు రూ. 54 కోట్లతో 2,500 ఎకరాలకు సాగునీరు అందించనుండడం సంతోషంగా ఉందన్నారు. చరిత్రలో ఏ ప్రభుత్వం చేయని విధంగా అభివృద్ధి, సంక్షేమ పథకాలు తాము అమలు చేస్తున్నామని చెప్పారు. ఖమ్మం జిల్లాకు వ్యవసాయంతో పాటు పరిశ్రమల స్థాపనకు కృషి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. ఈ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ ను మంత్రి తుమ్మల పట్టుబట్టి మరి సాధించారన్నారు. సంక్రాంతి కానుకగా రఘునాధపాలెం ప్రజలకు లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం ఇవ్వాలని తుమ్మల పట్టుబట్టారని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. మంత్రులమందరం అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్నామని చెప్పారు. రూ.1.8 లక్షల కోట్లు ఖర్చు చేసి నామమాత్రంగా ఆయకట్టు నిర్మించినా.. సాగులోకి మాత్రం తీసుకు రాలేదన్నారు. రూ. లక్ష కోట్లు ఖర్చు చేసి కాళేశ్వరం నిర్మించి.. ఒక్క ఎకరాకు సైతం సాగు నీరు అందించలేదన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఈ ఏడాది ఎన్నడూ లేని విధంగా రైతులు పంట పండించారన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో రాబోయే నాలుగేళ్లలో అన్ని ప్రాజెక్టు పనులు పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. సీతారామ పూర్తి చేసి గోదావరి జలాలు.. ఖమ్మం జిల్లాకు తీసుకు వస్తామన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమం లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి అండగా నిలిచిన మీ త్యాగాలు మర్చిపోమని ఆయన పేర్కొన్నారు.

# జడ్ మోడ్ సొరంగాన్ని ప్రారంభించిన ప్రధాని మోదీ

న్యూఢిల్లీ,ప్రజాభూమి

ప్రధాని నరేంద్ర మోదీ సోమవారం జమ్ముకశ్మీర్‌లోని సోన్‌మార్గ్ ప్రాంతంలో జడ్ మోడ్ సొరంగాన్ని ప్రారంభించారు. ప్రధాని రాక నేపథ్యంలో జమ్ముకశ్మీర్‌లో అధికారులు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. టన్నెల్ ప్రారంభోత్సవంలో జమ్ముకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా, లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా, కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ తదితరులు పాల్గొన్నారు. శ్రీనగర్ నుంచి కార్గిల్ వెళ్లే దారిలో శ్రీనగర్-లేహ్ జాతీయ రహదారిపై ఈ టన్నెల్‌ను నిర్మించారు. ఈ టన్నెల్ నిర్మాణం కోసం ఏకంగా రూ.2,500 కోట్లు ఖర్చు చేశారు. భారత రక్షణ రంగానికి వ్యూహాత్మకంగా ఈ టన్నెల్ చాలా కీలకం కానుంది. ఈ జడ్ మోడ్ సొరంగం 6.5 కిలోమీటర్ల పొడవు ఉంది. ఈ టన్నెల్ ద్వారా ఏ సీజన్‌లోనైనా లడఖ్‌కు చేరుకోవడానికి వీలవుతుంది. టన్నెల్‌కు సంబంధించి 2015లో ప్రారంభమైన నిర్మాణ పనులు గత ఏడాది పూర్త య్యాయి. ఈ జడ్ మోడ్ టన్నెల్ భారత్‌కు వ్యూహాత్మకంగా చాలా కీలకమైనది. దాదాపు సముద్రమట్టానికి 8,500 అడుగుల ఎత్తులో దీన్ని నిర్మించారు. అత్యంత శీతలమైన లడఖ్‌ను ఏ సీజన్‌లో అయినా సందర్శిం చేందుకు ఈ టన్నెల్ ఉపయోగపడనుంది.

ఈ సొరంగం రవాణా వ్యవస్థతోపాటు రక్షణ వ్యవస్థకు కూడా కీలకం కానుంది. ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లోనూ సోనామార్గ్ పట్టణానికి టన్నెల్ ద్వారా వెళ్లొచ్చు. జమ్ముకశ్మీర్‌లో 'జడ్ మోడ్' టన్నెల్ ఏర్పాటుతో కార్గిల్ మరింత సురక్షితంగా మారింది. గతంలో కార్గిల్‌లో పాకిస్తాన్ ఉగ్రవాదులు దుశ్చర్యలకు పాల్పడగా భారత్ ఏకంగా యుద్ధమే చేయాల్సి వచ్చింది. శీతాకాలంలో తీవ్రంగా మంచు కురిసే సమయాన్ని ఆసరా చేసుకుని ఉగ్రవాదులు భద్రతాబలగాలపై దాడులకు తెగబడ్డారు. అప్పట్లో కార్గిల్ ప్రాంతం పాకిస్థాన్ ఉగ్రవాదుల హస్తగతమైతే శ్రీనగర్ లేహ్ మధ్య రాకపోకలు నిలిచిపోయేవి. ఇప్పుడు సొరంగం ద్వారా సైన్యం కార్గిల్‌కు వేగంగా చేరుకునే అవకాశం ఉంది.

# పండుగ వేళ అదిరిపోయే న్యూస్..

మొదటిపేజీ తరువాయి

శాఖ ఆధ్వర్యంలో ఆహార భద్రత రేషన్ కార్డులు జారీ కానున్నాయి. దీంతో దీర్ఘకాలంగా పెండింగ్ లో ఉన్న ఉన్న వినతుల పరిష్కారం కోసం సర్కారు ముందడుగు వేసినట్లయింది. కొత్త రేషన్ కార్డుల మంజూరుతోపాటు.. పాత రేషన్ కార్డులలో మార్పులు, చేర్పులు కూడా చేయనున్నారు.కేబినెట్ సబ్ కమిటీ సిఫారసులకు అనుగుణంగా రేషన్ కార్డుల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ జరగనుంది. దరఖాస్తులను నిశితంగా పరిశీలించిన తర్వాత కుల గణన సర్వే ఆధారంగా చేసిన రేషన్ కార్డులు లేని కుటుంబాల జాబితాను జిల్లా కలెక్టర్, కమిషనర్‌లకు క్షేత్రస్థాయి పరిశీలన నిమిత్తం పంపిస్తారు. మండల స్థాయిలో ఎంపీడీవో, యూఎల్‌బీలో మున్సిపల్ కమిషనర్ ఈ మొత్తం ప్రక్రియకు బాధ్యులుగా వ్యవహరిస్తారు. ముసాయిదా జాబితాను గ్రామసభ, వార్డులో ప్రదర్శిస్తారు.. ఈ సందర్భంగా చదివి వినిపించి చర్చించిన తర్వాత కొత్త రేషన్ కార్డులకు ఆమోదం లభించనుంది.దీంతోపాటు.. ఎన్నో ఏళ్లుగా పెండింగ్ లో ఉన్న ఆహార భద్రత కార్డుల్లో సభ్యుల చేర్పులు, మార్పులు సైతం జరగనున్నాయి. అర్హత కలిగిన కుటుంబాలకు ఈ నెల 26 నుంచి పౌరసరఫరాల శాఖ కొత్త ఆహార భద్రత కార్డులు జారీ చేయనుందని అధికారిక ఉత్తర్వుల్లో తెలిపారు.

# ప్రారంభమైన మహాకుంభమేళా

మొదటిపేజీ తరువాయి

హిమాచల్ ప్రదేశ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ సహా పలు రాష్ట్రాల నుంచి వేలాదిగా భక్తులు తరలిరావడంతో వివిధ ఘాట్లు కిటకిలలాడాయి. మహాకుంభమేళా వేలాదిగా తరలి వస్తున్న భక్తులకు ఉత్తరప్రదేశ్ ముఖ్య మంత్రి యోగి ఆదిత్యనాథ్ అభినందనలు తెలిపారు. పుష్యమాస పౌర్ణమి రోజున త్రివేణి సంఘంలో పవిత్ర స్నానాల కోసం విచ్చేసి సాధువులు, కల్పవాసీలు, భక్తులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. 'మహా కుంభమేళా తొలిరోజు సనాతన ధర్మాన్ని ఆచరించే 1.50 కోట్ల మంది స్వచ్ఛమైన త్రివేణీ జలాల్లో పవిత్ర స్నానాలు చేయడం ద్వారా ఈ పండుగను విజయవంతం చేశారు. ఇందుకు సహకరించిన మహాకుంభ మేళా అడ్మినిస్ట్రేషన్, ప్రయాగ్‌రాజ్ అడ్మినిస్ట్రేషన్, మున్సిపల్ కార్పొరేషన్ ప్రయాగరాజ్, స్వచ్ఛాగ్రహీలు, గంగా సేవాదూత్‌లు, కుంభ్ సేవక్లు, మత-సామాజిక సంస్థలు, వివిధ వాలంటీర్లు, మిత్రులు, మీడియా ప్రపంచం సహా మహాకుంభ్‌తో మమేకమైన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన వివిధ శాఖలకు ధన్యవాదాలు తెలియజేస్తు న్నాను' అని యోగి పేర్కొన్నారు.'మహాకుంభ్' భిన్నత్వంలో ఏకత్వం సందేశాన్ని చాటుతూ భిన్న సంస్కృతులను ఏకం చేస్తోందని యోగి ఆదిత్యనాథ్ ఒక ట్వీట్‌లో అభివర్ణించారు. సాంస్కృతీ సమ్మేళనం ఎక్కడుంటుందో విశ్వాసం, సామరస్యం అక్కడే ఉంటుందన్నారు. ప్రయోగ్‌రాజ్ సనాతన ధర్మానికి ప్రతీకగా నిలుస్తోందని చెప్పారు. కాగా, తెల్లవారుజాము నుంచి దట్టమైన పొగమంచు, తీవ్రమైన చలిగాలులు ఉన్నప్పటికీ లెక్కచేయకుండా వేలాది మంది భక్తులు త్రివేణీ సంగమంలో పవిత్ర స్నానాలకు ఎంతో ఉత్సాహంగా తరలివచ్చారు. వయోభేదం లేకుండా అన్ని రంగాలకు చెందిన ప్రజలు పవిత్ర స్నానాలతో పులకించిపోయారు. భజనలు, జై గంగా మయ్యా నినాదాలు మధ్య 'మహాకుంభ్' అంగరంగ వైభవంగా మొదలైంది.

# సంక్రాంతి ముసుగులో నిబంధనలు ఉల్లంఘన

## - ఆర్టీఏ తనిఖీల్లో ప్రైవేట్ ట్రావెల్స్‌పై 300 కేసులు



హైదరాబాద్, ప్రజాభూమి

సంక్రాంతి నేపథ్యంలో నిబంధనలకు విరుద్ధంగా తిరుగుతున్న ప్రైవేటు ట్రావెల్స్‌పై రవాణాశాఖ కొరడా ఝుళిపించింది. గత నాలుగు రోజులుగా రవాణాశాఖ తనిఖీలు చేపట్టింది. హైదరాబాద్, రంగారెడ్డి, నల్గొండ, నిజామాబాద్, మహబూబ్ నగర్ తదితర ప్రాంతాల్లో 12 ప్రత్యేక బృందాలుగా ఏర్పడి తనిఖీలు చేపట్టింది.హైదరాబాద్ నగరంలోని ఎల్బీ నగర్, ఆరాంఘర్ వద్ద తనిఖీల సందర్భంగా నిబంధనలకు విరుద్ధంగా తిరుగుతోన్న ప్రైవేట్ ట్రావెల్స్‌పై 300లకు పైగా కేసులు నమోదు చేసినట్లు రవాణాశాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ జాయింట్ ట్రాన్స్ పోర్ట్ కమిషనర్ చంద్రశేఖర్ గౌడ్ తెలిపారు. తనిఖీలు నిరంతరం కొనసాగుతూనే ఉంటాయని స్పష్టం చేశారు. సంక్రాంతి పండుగ నేపథ్యంలో ప్రైవేట్ ట్రావెల్స్ యజమానులు ఇష్టారాజ్యంగా ప్రయాణికుల నుంచి ఛార్జీలు వసూలు చేస్తున్నట్లు తమకు ఫిర్యాదులు వస్తున్నాయని..ఆ నేపథ్యంలో విస్తృత తనిఖీలు చేపట్టామన్నారు. వీటితో పాటు నిబంధనలకు విరుద్ధంగా ఉన్న వాహనాలపై ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు.

# తెలంగాణ పసుపు బోర్డు ఏర్పాటు

## - ఛైర్మన్‌గా పల్లె గంగారెడ్డి నియామకం

న్యూఢిల్లీ, ప్రజాభూమి



తెలంగాణ రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం సంక్రాంతి పండుగ సందర్భంగా శుభవార్త అందించింది. నిజామాబాద్ కేంద్రంగా కొత్తగా పసుపు బోర్డ్ ఏర్పాటు చేయాలని కేంద్రం నిర్ణయించింది. ఈ విషయాన్ని కేంద్ర ప్రభుత్వం అధికారికంగా ప్రకటించి, పల్లె గంగారెడ్డిని పసుపు బోర్డు ఛైర్మన్‌గా నియమించినట్లు నోటిఫికేషన్ విడుదల చేసింది. ఎంపి బండి సంజయ్ ప్రయత్నం ఫలించి బోర్డు ఏర్పాటు జరిగింది. గతంలో స్పైసెస్ బోర్డు ఏర్పాటు చేయగా, ప్రత్యేకించి పసుపుబోర్డు ఏర్పాటు చేయాలన్న డిమాండ్ వచ్చింది. ఈ నిర్ణయంతో తెలంగాణలో పసుపు రైతుల క్రయ, విక్రయాలు, ప్రాసెసింగ్‌కు మరింత ప్రోత్సాహం లభించనుంది. నిజామాబాద్‌లో జాతీయ పసుపు బోర్డు ప్రారంభోత్సవం జరగనున్నది. ఈ కార్యక్రమం తెలంగాణకు మరో ప్రాముఖ్యమైన మైలురాయి కానుంది. ఈ కార్యక్రమానికి కేంద్ర వాణిజ్య, పరిశ్రమల, వ్యవసాయ శాఖల అధికారులు, పశ్చిమ రాష్ట్రాల ఇతర వ్యవసాయ సంబంధిత నాయకులు, తెలంగాణ ప్రభుత్వ ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొననున్నట్లు తెలిసింది. ప్రారంభోత్సవం సందర్భంగా పసుపు రైతులకు సంబంధించి వ్యూహాలు, నూతన ప్రాజెక్టులు, కేంద్ర ప్రభుత్వ విధానాలు, సహాయ కార్యక్రమాలను ప్రకటించే అవకాశం ఉంది. రైతులకు పసుపు విక్రయాలు, మార్కెట్‌కు ఉన్న అవరోధాలు, రుణాల వంటి అంశాలపై పలు ముఖ్యమైన చర్చలు జరగనున్నాయి. పసుపు రైతుల సమస్యలు, అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టేందుకు కేంద్రం ఈ బోర్డు స్థాపించనుంది. తెలంగాణ రాష్ట్రంలో పసుపు సాగులో ముఖ్యమైన పాత్ర పోషిస్తున్న నిజామాబాద్, కొమురంభీం ఇతర జిల్లాలలోని రైతులకు ఈ బోర్డు ద్వారా మరింత సాయం అందనుంది. కేంద్ర ప్రభుత్వం పసుపు పంటను ఒక ప్రత్యేకమైన పరిశ్రమగా భావించి, రైతుల సమస్యలు పరిష్కరించేందుకు ఈ బోర్డు ఏర్పాటును ప్రకటించింది. మరోవైపు ప్లలె గంగారెడ్డి రైతు సంక్షేమం కోసం పోరాడిన వ్యక్తి. ఆయన వ్యవసాయ రంగం మీద అవగాహన, పసుపు రైతుల సమస్యలను అర్థం చేసుకోవడంలో అనుభవం ఉన్న వ్యక్తి కావడంతో ఆయన నియామకాన్ని కేంద్రము సమర్థించింది. ఆయన మార్కెట్ ప్రవర్తన, గుణాత్మక అభివృద్ధిపై అనేక మార్గదర్శకాలపై అభిప్రాయం వెల్లడించారు. పసుపు బోర్డు ఏర్పాటు ద్వారా రైతులకు అనేక కొత్త అవకాశాలు రానున్నాయి. రైతులు పసుపు పంటను మరింత మంచి ధరలలో విక్రయించేందుకు మరింత సహాయాన్ని అందుకుంటారు. దీంతోపాటు పసుపు ప్రాసెసింగ్, ఎగుమతుల ప్రోత్సాహం, నూతన టెక్నాలజీలను ఉపయోగించి పంటల ఉత్పత్తి పెంచడం వంటి అంశాలపై రైతులకు మరింత అవగాహన పెరుగుతుంది. ఈ కొత్త బోర్డు ఏర్పాటుతో రైతులకు మంచి అవకాశం దక్కనుంది. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం పట్ల అనేక మంది రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

# జనసేన కార్యాలయంలో సంక్రాంతి సంబరాలు

గుంటూరు, ప్రజాభూమి

తెనాలిలోని జనసేన కార్యాలయంలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు.. జనసేన పార్టీ కార్యాలయంలో భోగి మంటలను వెలిగించారు మంత్రి నాదెండ్ల మనోహర్.. భోగి వేడుకల్లో వీర మహిళలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.. ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు ప్రతి ఇంట్లో పండుగ వాతావరణం ఆనందంతో సుఖ సంతోషాలతో జరుపుకోవాలని కోరుకుంటున్నాం.. గత నాలుగైదు సంవత్సరాలుగా ఇబ్బంది పడుతున్న రైతాంగానికి కూటమి ప్రభుత్వం అండగా నిలబడిందన్నారు.. గత ప్రభుత్వం రైతులకు బకాయి పెట్టిన 1674 కోట్ల బకాయిలను కోటం ప్రభుత్వం రాగానే వారి ఖాతాలో జమ చేశాము.. రైతులు వద్ద ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లోపే వారి ఖాతాల్లో నగదు జమ చెయ్యటం ద్వారా ముందుగానే సంక్రాంతి వచ్చిందని భావన రైతులు వ్యక్తం చేశారని తెలిపారు. కూటమి ప్రభుత్వం రైతుల పట్ల అద్భుతంగా పనిచేసినందుకు గర్వపడుతున్నాం అన్నారు మంత్రి మనోహర్.. 6830 కోట్ల రూపాయల ధాన్యం కొనుగోలు చేయటమే కాక 94 శాతం రైతుల ఖాతాల్లో నగదు చెల్లించాం అన్నారు..

# పేదల సొంత ఇంటి కల నెరవేరబోతోంది

- పేదలకు ఇచ్చిన ప్రతి ఒక్క హామీని అమలు చేస్తోంది
- మోడల్ ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించిన పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ఖమ్మం,ప్రజాభూమి

తెలంగాణ రాష్ట్రంలో పేదల సొంత ఇంటి కల నెరవేరబోతోందని రాష్ట గృహ నిర్మాణ, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. . తెలంగాణ ప్రభుత్వం పేదలకు ఇచ్చిన ప్రతి ఒక్క హామీని అమలు చేస్తోందని అన్నారు. ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తూ రాష్ట్రంలో సంక్షేమ పాలన కొనసాగిస్తున్నామని తెలిపారు. ఖమ్మం జిల్లాలోని పాలేరు నియోజకవర్గం కుసుమంచిలో నిర్మించిన మోడల్ ఇందిరమ్మ ఇళ్లును సోమవారం ప్రారంభించారు. రూ. 5 లక్షల వ్యయంతో నిర్మించిన ఇంటిని మంత్రి శ్రీనివాస రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. ఎన్ని కుట్రలు, ఎన్ని ఆటంకాలు ఎదురైనా పేదల కల నెరవేర్చుతామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్రంలో రాజకీయాలు, కులమతాలకు అతీతంగా ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపు జరుగుతుందని తెలిపారు. ఒక్క రూపాయి ఎవరికీ ఇవ్వాల్సిన పని లేదని స్పష్టం చేశారు. కేవలం పేదవారయితే చాలు ఇందిరమ్మ ఇల్లు వస్తుందని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపు నిరంతర పక్రియ అని చెప్పారు. సంక్రాంతి పండుగ సందర్భంగా రాష్ట్రంలో పేదవాడికి తీయని కబురు చెబుతున్నామని అన్నారు. త్వరలోనే అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేయబోతున్నామని అన్నారు. నాలుగేళ్లలో 20 లక్షల ఇందిరమ్మ ఇళ్ల



నిర్మాణం జరుగబోతోందన్నారు. రైతులకు రైతు బంధు పథకం ద్వారా ఎకరాకు రూ. 12 వేలు ఇస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో అర్హులైన పేదలకు రేషన్ కార్డు ఇవ్వబోతున్నామని చెప్పారు. రాష్ట్రంలో భూమి లేని నిరుపేదలకు దేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఇందిరమ్మ భరోసా పథకం ధ్వారా రూ.12 వేలు రెండు విడతలుగా ఇవ్వబోతున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు.

# బంగ్లా సరిహద్దుల్లో కొనసాగుతున్న ఉద్రిక్తత

- భారత హైకమిషనర్‌తో బంగ్లావిదేశాంగ కార్యదర్శి భేటీ

న్యూఢిల్లీ,ప్రజాభూమి

సరిహద్దు ఉద్రిక్తతల మధ్య, బంగ్లాదేశ్ విదేశాంగ కార్యదర్శి జాషిమ్ ఉద్దీన్ భారత హైకమిషనర్ ప్రణయ్ వర్మను కలిశారు. ఈ సమయంలో సరిహద్దులో ఉద్రిక్తత గురించి ఇద్దరూ ఆందోళన వ్యక్తం చేశారు. ఇద్దరి మధ్య సమావేశం దాదాపు 45 నిమిషాల పాటు కొనసాగింది. నిజానికి, షేక్ హసీనా ప్రభుత్వాన్ని బంగ్లాదేశ్ నుండి తొలగించిన తర్వాత, రెండు దేశాల మధ్య ఉద్రిక్తత కనిపించింది. బంగ్లాదేశ్‌లో హిందూ మైనారిటీలు హింసకు గురవుతున్నారు. వారిని క్రూరంగా హింసిస్తున్నారు. భారతదేశం దాని గురించి కఠినంగా ఉంది. ఇప్పుడు బంగ్లాదేశ్ సరిహద్దు నుండి కూడా చొరబాట్లు ప్రారంభమయ్యాయి. ఇటీవల బీఎస్ఎఫ్ చాలా మంది స్మగ్లర్లను పట్టుకుంది. సరిహద్దు వద్ద భద్రతా ఉల్లంఘనలను నివారించడానికి, బీఎస్ఎఫ్ సరిహద్దులో ముళ్ల తీగలను ఉపయోగిస్తోంది. బిఎస్ఎఫ్ చాలా కాలంగా ఈ పని చేస్తోంది. దీనిపై బంగ్లాదేశ్ అభ్యంతరం వ్యక్తం చేసింది. భారతదేశం ద్వైపాక్షిక ఒప్పందాన్ని ఉల్లంఘిస్తోందని మరియు భారతదేశం-బంగ్లాదేశ్ సరిహద్దులో ఐదు చోట్ల ముళ్ల తీగలను ఏర్పాటు చేయడానికి ప్రయత్నిస్తోందని బంగ్లాదేశ్ తెలిపింది. సరిహద్దులో భారతదేశం కంచె వేయడం అనధికారికం. ఇలాంటి కార్యకలాపాలు ద్వైపాక్షిక సంబంధాలకు హాని కలిగిస్తాయని బంగ్లాదేశ్ విదేశాంగ కార్యదర్శి జాషిం ఉద్దీన్ అన్నారు. ఈ సమావేశానికి ముందు బంగ్లాదేశ్ భారత హైకమిషనర్ ప్రణయ్ వర్మను పిలిపించినట్లు వార్తలు వచ్చాయి. కానీ తరువాత సరిహద్దులో కొనసాగుతున్న ఉద్రిక్తత గురించి చర్చించడానికి అతన్ని పిలిచారని వార్తలు వచ్చాయి. బంగ్లాదేశ్ విదేశాంగ కార్యదర్శిని కలిసిన తర్వాత, భారత హైకమిషనర్ ప్రణయ్ వర్మ మీడియాతో మాట్లాడుతూ.. నేను విదేశాంగ కార్యదర్శిని కలిశాను. సరిహద్దు నేరాలను రహితంగా చేయడం, నేరస్థుల కదలికలను ఆపడం, మానవ అక్రమ రవాణా సవాళ్లను ఎదుర్కోవడం వంటి అంశాలపై చర్చించాను.సరిహద్దులో ముళ్ల తీగల ఏర్పాటుకు సంబంధించి మా మధ్య పరస్పర ఒప్పందం ఉందని



ఆయన అన్నారు. ఈ విషయంలో బీఎస్ఎఫ్, బోర్డర్ గార్డ్ బంగ్లాదేశ్ మధ్య చర్చలు జరుగుతున్నాయి. పరస్పర ఒప్పందం అమలు అవుతుందని ఆశిస్తున్నట్లు తెలిపారు. ఇంతలో బంగ్లాదేశ్ విదేశాంగ కార్యదర్శి జాషిమ్ ఉద్దీన్ మాట్లాడుతూ.. భారత అధికారులు ఎటువంటి రెచ్చగొట్టే ప్రకటనలు చేయవద్దని విజ్ఞప్తి చేశారు. రెచ్చగొట్టే చర్యలకు దూరంగా ఉండండి. ఎందుకంటే ఇది ఉమ్మడి సరిహద్దు వెంబడి ఉద్రిక్తతలను పెంచుతుంది. సరిహద్దులో శాంతి, సామరస్యాన్ని కాపాడుకునే విధంగా సరిహద్దు సమస్యను పరిష్కరించాలి. అంతకుముందు, బంగ్లాదేశ్ హోం వ్యవహారాల సలహాదారు లెఫ్టినెంట్ జనరల్ (రిటైర్డ్) జహంగీర్ ఆలం చౌదరి మాట్లాడుతూ.. సరిహద్దు గార్డు బంగ్లాదేశ్, స్థానిక ప్రజల నుండి తీవ్ర వ్యతిరేకత కారణంగా భారతదేశం సరిహద్దులో ముళ్ల తీగలను ఏర్పాటు చేసే పనిని నిలిపివేసిందని అన్నారు. బంగ్లాదేశ్‌తో ఉన్న 4156 కిలోమీటర్ల సరిహద్దులో భారతదేశం ఇప్పటికే 3271 కిలోమీటర్ల మేర కంచె వేసిందని, దాదాపు 885 కిలోమీటర్ల సరిహద్దుకు కంచె వేయలేదని ఆయన అన్నారు. ఇటీవల ఐదు రంగాలలో వివాదాలు తలెత్తాయి.

## రోడ్డు భద్రత గురించి తెలుసుకోండి

- వాహనదారులకు మంత్రి సీతక్క హెచ్చరిక



ఆసిఫాబాద్,ప్రజాభూమి

కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో రోడ్డు భద్రత మాసాతోత్సవాల్లో స్త్రీ-శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వాహనదారలు రోడ్డు భద్రత గురించి తెలుసుకోవాలి అన్నారు. బీర్లకు, బార్లలో ఖర్చు చేస్తున్నారు.. కానీ ప్రాణానికి రక్షణనిచ్చే హెల్మెట్ కోసం మాత్రం ఖర్చు చేయడం లేదని వాపోయారు. జిల్లాలో గత ఏడాదిలో 213 మంది చనిపోయారు.. మనతో పాటు మనల్ని నమ్ముకున్న వాళ్లు ఉంటారు.. అందుకే రోడ్డు భద్రత ప్రతి ఒక్కరు పాటించాలని మంత్రి సీతక్క తెలిపారు. ఇక, వాహానాలు ఎక్కి డ్రైవింగ్ చేసేటప్పుడు మద్యం సేవించరాదు.. సెల్ ఫోన్ మాట్లాడుతూ.. డ్రైవింగ్ చేయరాదు అని సీతక్క సూచించారు. అలాగే, ప్రతి ఒక్క ద్విచక్ర వాహనదారుడు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని వెల్లడించింది. శిరస్త్రం లేకుండా వాహనం నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే, మితిమీరి వేగంతో వెళ్లరాదు అని పేర్కొన్నారు. దీంతో పాటు వాహనదారులు రోడ్డు మీదకు వచ్చేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవడం వల్ల ప్రమాదాలు తగ్గిపోతాయని మంత్రి సీతక్క చెప్పారు.

## తెలుగు ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపిన మాజీ సీఎం కేసీఆర్

హైదరాబాద్,ప్రజాభూమి





రాష్ట్ర ప్రజలకు బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. సంక్రాంతి రైతులు, వ్యవసాయానికి ప్రత్యేకమైన పండుగ అని చెప్పారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ వ్యవసాయానికి పండుగ శోభ సంతరించు కుందన్నారు. దేశంలో మరె క్కడా లేని విధంగా రైతు సంక్షేమా నికి పెద్దపీట వేసిన ఘనత బీఆర్ ఎస్ పార్టీదే అన్నారు. 'పండిన పంటల రాశులతో ఇండ్లు కళకళలా డుతుంగా, రైతుల జీవితాల్లో సంక్రాంతి శోభ నిండుదనాన్ని సంతరించు కుంటుంది. నూతన తెలంగాణ రాష్ట్రంలో వ్యవసాయం పండుగ కావాలని నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం అనేక పథకాలు ప్రారంభించింది. రైతు సంక్షేమమే తొలి ప్రాధాన్య తాంశంగా నాడు అమలు చేసిన కార్యాచరణ పదేండ్ల అనతి కాలం లోనే సత్ఫలితాలు ఇచ్చింది. 24 గంటల ఉచిత విద్యుత్, రైతుబంధు, రైతు బీమా పథకాలు పటిష్ఠంగా అమలు చేశాం.
తద్వారా సాధించిన వ్యవసాయ ప్రగతి ప్రపంచ వ్యాప్తంగా పలు ప్రశంసలు అందు కుంది. దేశానికే తెలంగాణను ఆదర్శంగా నిలిపామని తెలిపారు. కుల వృత్తులకు నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం అందించిన ప్రోత్సాహం, ఆర్థిక సహ కారం సబ్బండ కులాల జీవితాల్లో సంక్రాంతి శోభను నింపింది. పదేండ్ల బీఆర్ఎస్ సర్కార్ వ్యవసా యరంగ అభివృద్ధి కోసం దాదాపు నాలుగున్నర లక్షల కోట్ల రూపా యలు ఖర్చు చేసింది. రైతుల జీవితాల్లో వెలుగు నింపాలనే దృఢసంకల్పంతో ముందుకెళ్లాం. ఉమ్మడి రాష్ట్రంలో దండగన్న తెలంగాణ వ్యవసాయం బీఆర్ఎస్ హయాంలో పండుగలా మారింది. రాజకీయాలకు అతీతంగా రైతన్న సంక్షేమమే ధ్యేయంగా పదేండ్ల ప్రగతి ప్రస్థానాన్ని నేటి ప్రభుత్వం కొనసాగించాలి.' అని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అన్నారు.


## పండుగ పూట నీటి కష్టాలు



హైదరాబాద్,ప్రజాభూమి

నగరంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం నుంచి 24 గంటల పాటు నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడనుంది. ఈ మేరకు హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు ఓ ప్రకటనను విడుదల చేసింది. హైదరాబాద్‌కు తాగు నీటిని సరఫరా చేసే మంజీరా ప్రాజెక్ట్ ఫేజ్ -2లో మరమత్తుల కారణంగా నీటి సరఫరా నిలిచిపోనున్నట్లు అధికారులు తెలిపారు. కలబ్‌గూర్ నుంచి హైదర్‌నగర్ వరకు ఉన్న 1500 ఎంఎం డయామీటర్ పంపింగ్ మెయిల్‌లో పలు చోట్ల భారీగా లీకేజ్‌లు ఏర్పడిందని.. దీనివల్ల నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడిందని జలమండలి అధికారులు వెల్లడించారు. లీకేజ్ మరమత్తులు చేపట్టామని.. దీంతో తాత్కాలికంగా నీటి సరఫరా నిలిచిపోనున్నట్లు తెలిపారు. దాదాపు 24 గంటల పాటు.. అంటే ఈరోజు ఉదయం 6 గంటల నుంచి రేపు ఉదయం (జనవరి 14) 6 గంటల వరకు నీటి సరఫరా నిలిచిపోనున్నట్లు వెల్లడించారు. నీటి సరఫరాలో అంతరాయం నేపథ్యంలో ప్రజలు నీటిని పొదుపుగా వాడుకోవాలని జలమండలి అధికారులు సూచనలు చేశారు.

## భారత్‌లో పెరుగుతున్న హెచ్‌ఎంపీవీ వైరస్ కేసులు



న్యూఢిల్లీ,ప్రజాభూమి

భారత్‌లో హ్యూమన్ మెటాప్ న్యూమో వైరస్ కేసులు క్రమంగా పెరుగుతున్నాయి. తాజాగా మరోచిన్నారి ఈ వైరస్ బారిన పడింది. పుదుచ్చేరికి చెందిన చిన్నారికి హెచ్‌ఎమ్‌పీవీ వైరస్ పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. ఆరోగ్య శాఖ అధికారి రవిచంద్రన్ తెలిపిన వివరాల ప్రకారం.. సదరు చిన్నారి జ్వరం, దగ్గు, జలుబుతో ప్రభుత్వ ఆధీనంలో నడుస్తున్న జవహర్‌లాల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పోస్ట్‌గ్రాడ్యుయేట్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ సెంటర్‌లో చేరినట్లు తెలిపారు. ప్రస్తుతం చిన్నారి వైద్య చికిత్సకు సహకరిస్తోందని చెప్పారు. కాగా, తాజా కేసుతో పుదుచ్చేరిలో హెచ్‌ఎమ్‌పీవీ కేసులు రెండుకు చేరాయి. గతవారం మూడేండ్ల చిన్నారి ఈ వైరస్ బారిన పడిన విషయం తెలిసిందే. చికిత్స తర్వాత పూర్తిగా కోలుకొని డిశ్చార్జ్ అయ్యింది. తాజా కేసుతో కలిపి భారత్‌లో హెచ్‌ఎమ్‌పీవీ కేసులు 18కి చేరాయి.

## రాష్ట్ర ప్రజలందరికీ కవిత భోగీ పండుగ శుభాకాంక్షలు



హైదరాబాద్,ప్రజాభూమి

తెలంగాణ రాష్ట్ర ప్రజలందరికీ బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత భోగీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కేబీఆర్ పార్క్ వద్ద తెలంగాణ సంస్కృతి ఆధ్వర్యంలో వైభవంగా భోగి వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకలకు ఎమ్మెల్సీ కవిత ముఖ్య అతిథిగా హాజరై భోగి మంటలను వెలిగించారు. ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున మహిళలు వచ్చారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. హైదరాబాద్ నడిబొడ్డున పల్లె వాతావరణం సృష్టించి భోగి వేడుకలు నిర్వహించడం అభినందనీయమన్నారు. భోగి అంటేనే ప్రతికూలతను వదిలిపెట్టి నూతన ఉత్సాహంతో ముందుకు వెళ్లాలి. మన సంస్కృతిని ముందు తరాలకు అందించేందుకు పండుగలే వారధి అని కవిత పేర్కొన్నారు.

## జగన్ సంక్రాంతి శుభాకాంక్షలు

అమరావతి,ప్రజాభూమి



ఈ పండుగ అందరి కుటుంబాల్లో భోగభాగ్యాలు నింపాలి' అని వైసిపి అధినేత వైఎస్.జగన్ ఆకాంక్షించారు. నేడు భోగి పండుగను పురస్కరించుకొని ? వైఎస్.జగన్ ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. తెలుగు ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ పండుగ అందరి కుటుంబాల్లో భోగ భాగ్యాలు నింపాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానన్నారు. 'తెలుగువారి సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి. ఈ పండుగ అందరి కుటుంబాల్లో భోగ భాగ్యాలు నింపాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు వారందరికీ భోగి, సంక్రాంతి, కనుమ శుభాకాంక్షలు ' అని చెప్పారు.

## మహా కుంభమేళా వద్ద ములాయం సింగ్‌యాదవ్ విగ్రహం

- అభ్యంతరం వ్యక్తం చేస్తున్న సాధువులు
- విమర్శలు ఎదుర్కొంటున్న సమాజ్‌వాద్ పార్టీ



లక్నో, ప్రజాభూమి

ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్ వద్ద మహా కుంభమేళా సోమవారం ఉదయం ప్రారంభమైంది. ఈ కుంభమేళాలో యూపీ మాజీ సీఎం, సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు ములాయం సింగ్ యాదవ్ విగ్రహాన్ని ప్రతిష్టించారు. ఈ విగ్రహాన్ని ప్రతిష్టించడంతో సమాజ్‌వాదీ పార్టీ తీవ్ర విమర్శలు ఎదుర్కొంటుంది. ములాయం విగ్రహాన్ని ఏర్పాటు చేయడంతో సాధువులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ములాయం సింగ్ యాదవ్ స్మృతి సేవా సంస్థాన్ సెక్టార్ 16లోని శిబిరంలో ఏర్పాటు చేశారు. రెండు నుంచి మూడు అడుగుల ఎత్తులో ఉన్న ములాయం విగ్రహాన్ని శనివారం ఆవిష్కరించినట్లు ఉత్తరప్రదేశ్ అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడు మాతా ప్రసాద్ పాండే ఆదివారం తెలిపారు. అయితే ములాయం విగ్రహ ఏర్పాటును అఖిల భారతీయ అఖార పరిషత్ తీవ్రంగా విమర్శించారు. పరిషత్ అధ్యక్షుడు మహంత్ రవీంద్ర పూరి మాట్లాడుతూ.. ములాయం సింగ్ యాదవ్ హిందూ వ్యతిరేకి అని మండిపడ్డారు. సనాతన ధర్మానికి వ్యతిరేకంగా ఆయన పని చేశారని విమర్శలు గుప్పించారు. ములాయం విగ్రహం ఏర్పాటుకు మేం వ్యతిరేకం కాదు.. ఆయన యూపీకి సీఎంగా పని చేశారు. కానీ మహా కుంభమేళాలో ములాయం విగ్రహాన్ని ప్రతిష్టించడం సరికాదు. ఈ విగ్రహ ఏర్పాటుతో యూపీలో ఆయన చేసిన అరాచకాలు, అల్లర్లు, మతవిద్వేషాలు గుర్తుకు వచ్చేలా ఉందన్నారు. ఈ దేశ ప్రజలకు ఏం సందేశం ఇవ్వాలనుకుంటున్నారు ఎస్పీ నేతలు. రామమందిర ఉద్యమంలో ఆయన సహకారం ఏమిటో అందరికీ తెలుసు. ఆయన ఎప్పుడూ హిందూ వ్యతిరేకి, సనాతన ధర్మానికి వ్యతిరేకి, ముస్లింలకు అనుకూలంగా ఉండేవారు అని రవీంద్ర పూరి పేర్కొన్నారు.

## జపాన్‌లో మరోమారు భూకంపం

- సునామీ హెచ్చరికలు జారీ



టోక్యో,ప్రజాభూమి

జపాన్‌లో భూకంపం సంభవించింది. స్థానిక కాలమానం ప్రకారం రాత్రి 9 గంటల సమయంలో దేశ నైరుతి ప్రాంతంలో 6.9 తీవ్రతతో ప్రకంపనలు నమోదైనట్లు దేశ వాతావరణ ఏజెన్సీ తెలిపింది. క్యుషు ద్వీపంలోని మియాజాకి ప్రాంతంలో 37 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రాన్ని గుర్తించినట్లు వెల్లడించింది. ఈ క్రమంలోనే మియాజాకితోపాటు కొచీ ప్రాంతాలకు సునామీ హెచ్చరికలు జారీ చేసింది. నష్టం వివరాలు ఇంకా తెలియరాలేదు. గతేడాది ఆగస్టులోనూ జపాన్‌లో రెండు భారీ భూకంపాలు సంభవించాయి. 6.9, 7.1 తీవ్రతతో ఏర్పడిన రెండు శక్తిమంతమైన భూకంపాలు నైరుతి దీవులైన క్యుషు, షికోకులను కుదిపేశాయి. అనేక ప్రాంతాలకు అధికారులు సునామీ హెచ్చరికలు జారీ చేశారు. అయితే.. ఎటువంటి ప్రాణ, ఆస్తినష్టం వాటిల్లకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. గతేడాది జనవరి 1న సుజు, వాజిమా పరిసర ప్రాంతాల్లో 7.6 తీవ్రతతో సంభవించిన భారీ భూకంపంలో 300 మందికి పైగా మృతి చెందిన విషయం తెలిసిందే.

## భోగి వేడుకల్లో పాల్గొన్న మాజీ మంత్రి కేటీఆర్



హైదరాబాద్, ప్రజాభూమి

తెలుగు రాష్ట్రాల్లో సంక్రాంతి సందడి మొదలైంది. మకర సంక్రాంతికి ముందు రోజు వచ్చే భోగి పండుగను తెలుగు ప్రజలు ఘనంగా జరుపుకుంటున్నారు. పిల్లలు, పెద్దలు ఉదయాన్నే వీధుల్లో భోగి మంటలు వేసి సందడి చేశారు. సామాన్య ప్రజలతోపాటు సినీ, రాజకీయ ప్రముఖులు సైతం భోగి వేడుకల్లో పాల్గొన్నారు. ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి ఇంట్లో భోగి సెలబ్రేషన్స్ ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, హరీశ్‌రావు పాల్గొన్నారు. ఆయనతోపాటు ఎమ్మెల్యేలు పాడి కౌశిక్ రెడ్డి, ముఠా గోపాల్, బండారి లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే బల్క సుమన్, పట్లోల్ల కార్తిక్ రెడ్డి తదితర నాయకులు పాల్గొన్నారు.

# లాస్ ఏంజిల్స్‌లో అదుపులోకి రాని కార్చిచ్చు

- ఇప్పటి వరకు 24మంది దుర్మరణం
- న్యూ ఇయర్ వేడుకల బాణాసంచా కొంపముంచింది
- పలు కోణాల్లో దర్యాప్తు ముమ్మరం



లాస్‌ఏంజిల్స్, ప్రజాభూమి

అమెరికాలోని లాస్ ఏంజెల్స్‌లో కార్చిచ్చు వ్యాప్తి కొనసాగుతోంది. వేగంగా వీస్తున్న గాలులతో మంటలు కొత్త ప్రాంతాలకు వ్యాపిస్తున్నాయి. దీంతో వేలాది ఇండ్లు కాలి బూడిదవుతున్నాయి. లక్షల కోట్ల రూపాయల ఆస్తి నష్టం వాటిల్లుతోంది. ప్రాణనష్టం సైతం క్రమంగా పెరుగుతోంది. ఇప్పటి వరకూ అందిన సమాచారం ప్రకారం.. కార్చిచ్చులో మరణించిన వారి సంఖ్య 24కు పెరిగింది. మరణించిన వారిలో అత్యధికంగా ఏటోన్ ర్‌లోనే 16 మంది కాగా, పాలిసేడ్స్‌లో 8 మంది ఉన్నారు. మరణాల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ఇక ఈ అగ్ని ప్రమాదాల్లో సుమారుగా 16 మంది తప్పిపోయినట్లు స్థానిక మీడియా నివేదించింది. మంటల ధాటికి ఇప్పటి వరకూ 12,000 నిర్మాణాలు అగ్నికి ఆహుతయ్యాయి. అంతేకాదు, పాలిసేడ్స్‌లో 23,707, ఏటోన్‌లో 14,117ఎకరాలు, కెన్నెత్‌లో 1,052, ముర్సెట్‌లో 779 ఎకరాలు దగ్ధమైనట్లు పేర్కొంది. మంటలను ఆర్పేందుకు కాలిఫోర్నియాతో పాటు అమెరికాలోని తొమ్మిది నగరాలు, మెక్సికోకు చెందిన అగ్నిమాపక బృందాలు పని చేస్తున్నాయి. కాగా, లాస్ ఏంజెల్స్‌లో నివసించే హాలీవుడ్ నటులు వారికి కేటాయించిన నీటి కంటే ఎక్కువ వినియోగించుకున్నారని, దీంతో ఇప్పుడు మంటలు ఆర్పేందుకు నీటి కొరత ఏర్పడిందని మర్శలు వ్యక్తమవుతున్నాయి. అమెరికా చరిత్రలోనే ఇది అత్యంత వినాశకరమైన ప్రకృతి వైపరీత్యమని కాలిఫోర్నియా గవర్నర్ గావిన్ న్యూసోమ్ అన్నారు. కార్చిచ్చు కొత్త ప్రాంతాలకు వ్యాపిస్తుండటం ఆందోళన కలిగిస్తున్నది. ప్రస్తుతం పాలిసేడ్స్ అగ్ని బ్రెంట్‌వుడ్ వైపు మళ్లింది. ఈ ప్రాంతంలో అమెరికా ఉపాధ్యక్షురాలు కమలా హారిస్‌తో పాటు పలువురు క్రీడాకారులు, నటీనటుల ఇండ్లు ఉన్నాయి. దీంతో ఉపాధ్యక్షురాలి హోదాలో చేయాల్సిన తన చివరి విదేశీ పర్యటనను కమలా హారిస్ రద్దు చేసుకున్నారు. మరోవైపు అమెరికాలోని టెక్సాస్, ఓక్లహోమా, మరికొన్ని రాష్ట్రాలను మంచు తుఫాను అతలాకుతలం చేస్తున్నది.లాస్ ఏంజెలెస్‌లోని కార్చిచ్చుల వ్యాప్తి కొనసాగుతూనే ఉంది. కొన్ని చిన్న మంటలను అదుపు చేసినా.. పాలిసేడ్స్, ఏటోన్ ప్రాంతాల్లో వ్యాపించిన మంటలను మాత్రం పూర్తిస్థాయిలో అదుపు చేయలేకపోతున్నారు. మరోవైపు నూతన సంవత్సర వేడుకల సందర్భంగా కాల్చిన బాణాసంచాతోనే ఇది మొదలైనట్లు అనుమానిస్తున్నారు. ఇప్పటివరకు ఈ అగ్ని ప్రమాదాల్లో మరణించిన వారి సంఖ్య 24కు చేరింది. అత్యధికంగా ఏటోన్ ఫైర్‌లోనే 16 మంది ప్రాణాలు కోల్పోగా.. పాలిసేడ్స్‌లో 8 మంది మరణించారు. ఈ సంఖ్య మరింత పెరగవచ్చని అధికారులు చెబుతున్నారు. అగ్నికీలల వ్యాప్తిని నెమ్మదింపజేయడానికి కొన్ని రసాయనాలు కలిపిన ఫోస్ చెక్ అనే మిశ్రమాన్ని దాదాపు 9 విమానాలు, 20 హెలికాప్టర్ల సాయంతో నగరంపై వెదజల్లుతున్నారు. పింక్ రంగులో ఉన్న ఆ పదార్థం అక్కడి నిర్మాణాలు, మొక్కలపైనా అవి పడి అగ్నికీలల వ్యాప్తిని నెమ్మదింపజేస్తుంది. దీనిలోని అమ్మోనియం పాలీపాస్ఫేట్ అంతవేగంగా ఆవిరి కాదు. దేనిమీదైనా పడితే సుదీర్ఘకాలం ఉండిపోతుంది. ఇది వృక్షాలపై పడి.. అగ్నికి ఆక్సిజన్ అందకుండా చేయడంతో అవి వేగంగా వ్యాపించలేవు. లాస్ ఏంజెలెస్‌లో అతిపెద్దదైన పాలిసేడ్స్ ఫైర్ కారణం న్యూఇయర్ వేడుకలని అనుమానిస్తున్నారు. నూతన సంవత్సరం సందర్భంగా కాల్చిన టపాసులతో అంటుకొని అక్కడ అగ్నిప్రమాదం జరిగింది. దానిని ఆర్పినా.. మిగిలిన నిప్పునకు బలమైన గాలులు తోడు కావడంతో కార్చిచ్చు రాజుకొన్నట్లు అనుమానిస్తున్నారని వాషింగ్టన్ పోస్టు కథనంలో పేర్కొంది. ఉపగ్రహ చిత్రాలు, రేడియో కమ్యూనికేషన్లు, స్థానికులను ఇంటర్వ్యూ చేసిన అనంతరం పాలిసేడ్స్ ఫైర్ అక్కడే మొదలైందని ఆ పత్రిక చెబుతోంది. సంపన్న ప్రాంతమైన పాలిసేడ్స్ సహా ఇతర ప్రాంతాల్లో విలువైన వస్తువులను వదిలేసి చాలా ఇళ్లు ఖాళీ చేశారు. దొంగలకు అవే లక్ష్యంగా మారుతున్నాయి. ఇప్పటివరకు 29 మంది దొంగలను అరెస్టు చేసినట్లు లాస్ ఏంజెలెస్ కౌంటీ షరీఫ్ రాబర్ట్ లూనా వెల్లడించారు. వీరిలో ఒకరు ఏకంగా అగ్నిమాపక సిబ్బంది దుస్తుల్లో అక్కడ సంచరిస్తున్నట్లు గుర్తించారు. ప్రస్తుతం ఖాళీ ఇళ్లను కాపాడేందుకు 400 మంది నేషనల్ గార్డ్స్‌ను ఇక్కడ మోహరించారు. ఇక ఇటీవల కెన్నెత్‌÷ర్‌ను అంటించినట్లు అనుమానిస్తున్న వ్యక్తి మెక్సికో నుంచి వచ్చిన అక్రమ వలసదారుడిగా గుర్తించారు. అతడి నుంచి బ్లోటార్చ్‌ను కూడా స్వాధీనం చేసుకొన్నట్లు అధికారులు పేర్కొన్నారు. లాస్ ఏంజెలెస్‌లో ప్రైవేటు డ్రోన్లు అగ్నిమాపక విమానాలకు ప్రాణాంతకంగా మారాయి. తాజాగా ఓ డ్రోన్ సూపర్ స్కూపర్‌ను ఢీకొంది. ఈ ఘటనలో విమానం దెబ్బతింది. అసలే వనరులు చాలక లాస్ ఏంజెలెస్ ఇబ్బందిపడుతున్న వేళ ఈ డ్రోన్లు తలనొప్పిగా మారాయి. తాజాగా ఆ డ్రోన్ ఆపరేటర్ కోసం ఎఫ్‌బీఐ గాలింపు మొదలుపెట్టింది.

# వేడెక్కుతున్న ఢిల్లీ ఎన్నికల ప్రక్రియ

- నామినేషన్ వేసిన సిఎం అతిషి




న్యూఢిల్లీ, ప్రజాభూమి

దేశ రాజధాని దిల్లీలో మరికొన్ని రోజుల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగ నున్నాయి. పోలింగ్ తేదీ దగ్గరపడుతున్న నేపథ్యంలో ప్రధాన పార్టీల ప్రచారం వేడెక్కింది. రానున్న అసెంబ్లీ ఎన్నికల కోసం ఢిల్లీ ముఖ్యమంత్రి అతిషి సోమవారం నామినేషన్ పత్రాలను సమర్పించారు. కల్కాజీ నియోజకవర్గం నుండి ఆమె పోటీకి దిగుతున్న సంగతి తెలిసిందే. నామినేషన్ పత్రాల దాఖలుకు ముందు కల్కాజీ నియోజకవర్గంలో భారీ ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీలో అతిషితో పాటు ఆప్ నేత మనీష్ సిసోడియా కూడా పాల్గొన్నారు. ర్యాలీ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నియోజకవర్గం అభివృద్ధి కోసం గత ఐదేళ్లుగా అవిశ్రాంతంగా కృషి చేశానని అన్నారు. కల్కాజీ ప్రజలు తన కుటుంబమని, వారు తనను సోదరిగా, కుమార్తెగా భావిస్తారని అన్నారు. తాను కేవలం ఈ నియోజకవర్గ ప్రతినిధిని మాత్రమే కాదని, వారి జీవితంలో ఓ భాగంగా భావిస్తారని అన్నారు. అణగారిన వర్గాల అభ్యున్నతికి ఆప్ కట్టుబడి ఉందని అన్నారు. బిజెపి పేదలకు వ్యతిరేకి అని, మురికివాడలకు వ్యతిరేకి అని దుయ్యబట్టారు. అతిషీకి పోటీగా బిజెపి నుండి రమేష్ బిదూరి, కాంగ్రెస్ నుండి మహిళా కాంగ్రెస్ జాతీయ అధ్యక్షురాలు అల్కా లంబాలు బరిలోకి దిగుతున్నారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు ఫిబ్రవరి 5న జరగనుండగా, ఫిబ్రవరి 8న ఫలితాలు వెలువడనున్నాయి. ఈక్రమంలోనే దిల్లీఎన్నికల ప్రచారం కోసం క్రౌడ్ ఫండింగ్ ప్రారంభించారు. దీనికి మంచి స్పందన లభించింది. ఒక్క రోజులోనే రూ.19.26 లక్షల ఆన్‌లైన్ విరాళాలు అందాయి. కాల్‌కాజీ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న ఆతిశీ మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. ఈ క్రౌడ్ ఫండింగ్‌ను ప్రారంభించారు. ఎన్నికల్లో పోటీ చేసేందుకు తనకు రూ.40లక్షలు కావాలని, అంత డబ్బు తన వద్ద లేనందున విరాళాలు ఇవ్వాలని ఆమె ప్రజలను కోరారు. ఇందుకోసం ఓ ఆన్‌లైన్ లింక్‌ను విడుదల చేశారు. అందులో ఇప్పటివరకు 443 మంది దాతలు రూ.19.26లక్షలు విరాళంగా అందించారు. 70 శాసనసభ స్థానాలున్న దిల్లీలో ఫిబ్రవరి 5న అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఫిబ్రవరి 8న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను ప్రకటించనున్నారు. గత రెండు పర్యాయాలు విజయం సాధించిన ఆమ్ ఆద్మీ పార్టీ ఈసారి కూడా గెలిచి హ్యాట్రిక్ కొట్టాలని ఉత్సాహంగా ఉంది. అటు ఆప్‌ను అడ్డుకొని అధికారంలోకి రావాలని భాజపా వ్యూహాలు రచిస్తోంది. ఈ ఎన్నికల్లో ఇండియా కూటమి పక్షాలైన కాంగ్రెస్, ఆప్ విడివిడిగానే పోటీ చేస్తుండటం గమనార్హం.

# కూటమి ప్రభుత్వంపై జగన్ అక్కసు

- మతి చలించి మాట్లాడుతున్న మాజీ సిఎం
- నిరాశా నిస్పృహల్లో జగన్ వ్యాఖ్యాలు
- మండిపడ్డ మంత్రి కొలుసు పార్థసారథి




విజయవాడ, ప్రజాభూమి

మూడు నెలల్లో కూటమి ప్రభుత్వం కూలిపోతుందని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు హాస్యాస్పదంగా ఉన్నాయని మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. జగన్ మాటలు వింటుంటే మతి చెలించి మాట్లాడుతున్నారనే అనుమానం కలుగుతోందని మంత్రి మండిపడ్డారు. జగన్ పని తీరు, వ్యవహారశైలి నచ్చక అనేక మంది నేతలు ఆ పార్టీని వీడుతున్నారని, అయినా ఆయన మాత్రం పద్ధతి మార్చుకోవడం లేదని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫ్యాన్ పార్టీ అధినేత పూర్తిగా నిరాశ, నిస్పృహల్లో కూరుకుపోయాయని, ఆ విషయం ఆయన మాటల ద్వారా అర్థమవుతోందని పార్థసారథి చెప్పుకొచ్చారు. కూటమి ప్రభుత్వంలో రైతులంతా సంతోషంగా ఉన్నారని, ధాన్యం సేకరణ విషయంలో జగన్ ప్రభుత్వం ఎలా మోసం చేసిందో రైతులకు తెలుసని మంత్రి విమర్శించారు. బిందు సేద్యం, పామాయిల్, మామిడి, ధాన్యానికి మద్దతు ధర వంటి వాటితో అన్నదాతలు సంతోషంగా ఉన్నారని, రైతులు పండించిన ప్రతి గింజనూ కొనుగోలు చేసిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతోందని తెలిపారు. అందుకే ఈ సంక్రాంతికి గత ఐదేళ్లలో ఎన్నడూ లేనంత సంతోషంగా అన్నదాతలు ఉన్నారని మంత్రి కొలుసు పార్థసారథి చెప్పుకొచ్చారు. ఈ సందర్భంగా మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ.. 'రైతుల నుంచి దాదాపు 29 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించి 24 గంటల్లోనే వారికి డబ్బులు చెల్లించాం. అందుకే రైతులు నేడు చాలా సంతోషంగా సంక్రాంతి పండగ నిర్వహించుకుంటున్నారు. గత ప్రభుత్వం చేసిన మోసాలను రైతులు ఒక్కసారి గుర్తు చేసుకోవాలి. ధాన్యం సేకరించి జగన్ ప్రభుత్వం డబ్బులు చెల్లించకపోతే మా ప్రభుత్వం ఆ బకాయిలు చెల్లించింది. ధాన్యం సేకరణలో వైసీపీ ప్రభుత్వం అన్నదాతలను మోసం చేసింది. వైసీపీ ప్రభుత్వంలో అన్యాయంగా రద్దు చేసిన అనేక కార్యక్రమాలను పునరుద్ధరించాం. ప్రతినెలా ఒకటో తేదీ నాటికి పెంచిన పెన్షన్లతో ఇళ్లకు వెళ్లి అందిస్తున్నాం. వచ్చే విద్యా సంవత్సరం నాటికి ప్రతి కుటుంబానికీ రూ.12 వేలు తల్లికి వందనం పేరుతో ఇవ్వబోతున్నాం. సూపర్ సిక్స్‌లో భాగంగా ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం అమలు చేస్తున్నాం. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేసి మా భూమి మాదే అనే ధైర్యం ప్రజలకు కల్పించాం. అన్న క్యాంటీన్ల ద్వారా పేదల పొట్ట నింపే కార్యక్రమం సీఎం చేపట్టారు. వైసీపీ హయాంలో సంక్రాంతి పండగకు స్వగ్రామాలకు వెళ్లలేమని ఏపీ ప్రజలు బాధపడేవారు. నేడు ఊరూరా రోడ్లు వేయడంతో సొంతూళ్లకు ఆనందంగా వెళ్లారు. ఏపీలో ప్రజలంతా సంతోషంగా ఉన్నారు. సంక్రాంతి పండగను సంబరంగా చేసుకుంటున్నారు.

# ఎక్కడా సమన్వయ లోపం లేదు

- సమిష్టి నిర్ణయాలతో ముందుకు వెళుతున్నాం
- సోషల్ మీడియా వేదికగా అసత్య ప్రచారాలు తగవు
- స్పష్టం చేసిన టిటిడి ఇవో, చైర్మన్




**తిరుమల, ప్రజాభూమి**

తిరుపతి తొక్కిసలాట ఘటన తర్వాత సోషల్ మీడియాలో టీటీడీపై రకరకాల పోస్టులు పెడుతున్నారు.. అయితే, సోషల్ మీడియాలో టీటీడీపై తప్పువు వార్తలు ప్రచారం చేయడం దురదృష్టకరం అని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు అన్నారు..తిరుమల అన్నమయ్య భవన్‌లో సోమవారం టిటిడి ఈవో, టిటిడి అదనపు ఈవోలతో కలసి టిటిడి ఛైర్మెన్ మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. దర్శన టిక్కెట్లు తిరుపతిలోనే జారి చేస్తామని స్పష్టం చేశారు.. అయితే, మార్పులు చేయాల్సి వస్తే వచ్చే ఏడాదికి నిర్ణయం తీసుకుంటాం అన్నారు.. తొక్కిసలాట ఘటనపై సీఎం నారా చంద్రబాబు నాయుడు విచారం వ్యక్తం చేశారు.. ఆ ఒక్క ఘటన మినహా మిగిలినవి అన్ని బాగా జరిగాయని తెలిపారు. తిరుమల శ్రీవారి భక్తులకు మరింత మెరుగైన, పటిష్టమైన, పారదర్శకమైన సేవలు అందించేందుకు సమిష్టిగా నిర్ణయాలు తీసుకుంటున్నామని టిటిడి ఛైర్మెన్ శ్రీ బీఆర్ నాయుడు తెలిపారు. ఈ సందర్భంగా టిటిడి ఛైర్మెన్ శ్రీ బీఆర్ నాయుడు మాట్లాడుతూ శ్రీవారి భక్తులకు పాదర్శకంగా సేవలు అందించేందుకు పాలక మండలిలో సమిష్టిగా చర్చించి నిర్ణయాలు తీసుకుంటున్నామని చెప్పారు. పాలకమండలి తీసుకునే నిర్ణయాలను అమలు చేయడంలో కొన్ని సాంకేతిక కారణాలతో ఆలస్యం అవుతుండవచ్చునేమో కాని, ఆలస్యం అవుతోందని తొందరపడి అసత్య ప్రచారం చేయవద్దని మీడియాను విజ్ఞప్తి చేశారు. తిరుమల విషయంలో ఒకటికి రెండు సార్లు పరిశీలించి, సంబంధిత వ్యక్తుల నుంచి వాస్తవ సమాచారాన్ని తెలుసుకుని వార్తలు రాయాలని సూచించారు. ఒకరిద్దరు మీడియా, సోషల్ మీడియాలో టిటిడి ఛైర్మెన్ కు, ఈవో శ్రీ శ్యామల రావుకు మనస్పర్థలు ఉన్నాయంటూ వార్తలు రాయడం సరికాదన్నారు. వైకుంఠ ఏకాదశికి శ్రీవారి భక్తులకు మెరుగైన సేవలు అందించామన్నారు. విద్యుత్ కాంతులు, పుష్పాలంకరణలు, క్యూలైన్లు, శ్రీవారి దర్శనం, అన్న ప్రసాదాలు, లడ్డూ ప్రసాదాలలో మరింత నాణ్యతగా అందించామన్నారు. తిరుపతిలో జరిగిన తోపులాట సంఘటన జరగడం సీఎం శ్రీ నారా చంద్రబాబు నాయుడు, తమను, దేశాన్ని, ప్రపంచాన్ని భాధించిందన్నారు. ఈ సంఘటనలో మృతి చెందిన కుటుంబాలకు , తీవ్రంగా గాయపడిన కుటుంబాలకు ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామన్నారు. ఇప్పటికే 31 మందికి పరిహారం అందించామని, మరో 20 మందికి రెండు మూడు రోజుల్లో పరిహారం అందిస్తామన్నారు. చిన్న పొరపాట్లు చేయకుండా చాలా ముందు జాగ్రత్తతో సేవలు అందిస్తున్నామన్నారు. టిటిడికి సంబంధించి సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేయవద్దని టిటిడి ఈవో శ్రీ జె. శ్యామలరావు విన్నవించారు. కొన్ని మీడియా సంస్థలు, సోషల్ మీడియా చేస్తున్న అసత్య వార్తలను నమ్మవద్దని సూచించారు. టిటిడిలో పాలక మండలిలో చర్చించి తీసుకునే నిర్ణయాలను అమలు చేయడం తమ బాధ్యతన్నారు. టిటిడి ఛైర్మెన్ , ఈవో మధ్య ఎలాంటి మనస్పర్థలు లేవు, సమన్వయ లోపం అసలు లేదన్నారు. టిటిడి ఛైర్మెన్ ను నేను ఏకవచంతో మాట్లాడినట్లు వచ్చిన వార్తలు నిజం కాదన్నారు. సాధారణ భక్తులకు పెద్ద పీట వేయాలని ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు సూచించిన సూచన మేరకు అమలు చేస్తున్నామన్నారు. గత 6 నెలల కాలంలో భక్తులకు నాణ్యమైన అన్నప్రసాదాలు, లడ్డూ ప్రసాదాలు, నెయ్యి సేకరణ, వసతి తదితర సేవలు అందిస్తున్నామన్నారు. టిటిడిలో దళారి వ్యవస్థను పూర్తిగా కట్టడి చేస్తున్నామని, ఆన్ లైన్ లో మోసాలను ఎప్పటికప్పుడు అప్రమత్తంగా టిటిడి విజిలెన్స్ విభాగం గుర్తించి చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. టిటిడిలో విజన్ డాక్యుమెంట్ ప్రకారం మాస్టర్ ఎ÷-లాన్ ను అమలు చేస్తున్నామన్నారు. భక్తుల సౌకర్యార్థం అవసరమైన సందర్భాలలో వివిధ రంగాల నిపుణుల సూచనలు, సహకారం తీసుకోవడం గత కొన్ని సంవత్సరాలుగా జరుగుతోందన్నారు. ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు టిటిడి ఈవో మాట్లాడుతూ, తిరుమలలో భక్తులకు శ్రీవారి దర్శనం, క్యూలైన్లు, అన్నప్రసాదాలు, కంపార్ట్‌మెంమెంట్ల నిర్వహణ, వసతి, మరుగుదొడ్ల నిర్వహణ, తదితర అంశాలు పూర్తిగా టిటిడి పరిధిలో ఉంటుందన్నారు, తిరుపతిలో జన రద్దీని ఎలా అదుపు చేయాలి, జన రద్దీ నిర్వహణ, క్యూలైన్ మేనేజ్మెంట్ , భద్రతా ఏర్పాట్లు, క్యూలైన్లు ఎక్కడ ఏర్పాటు చేయాలి, ఎంత ఎత్తులో ఉండాలి, ఎన్ని ఏర్పాటు చేయాలి, వాటి పటిష్టత ఎంత ఉండాలనే అంశాలు పూర్తిగా జిల్లా మేజిస్ట్రేట్ , జిల్లా ఎస్పీ పర్యవేక్షణలో ఉంటుందన్నారు. వారి సూచనల మేరకు టిటిడి ఏర్పాట్లు చేసిందన్నారు. జిల్లా కలెక్టర్, ఎస్పీలతో సమన్వయం చేసుకుని, వారి సూచనల మేరకు టోకెన్లు జారీ చేస్తామన్నారు. ఎక్కడైనా జన రద్దీని పూర్తిగా అదుపు చేయాల్సిన బాధ్యత జిల్లా ఎస్పీ చేతిలో ఉంటుందన్నారు. భక్తుల తోపులాట అంశంపై జ్యూడిషియల్ ఎంక్వైరీ జరుగుతోందని, న్యాయ విచారణలో పూర్తి విషయాలు వెల్లడవుతాయన్నారు.ఇక, టీటీడీలో సమన్వయం లోపం ఉందంటూ జరుగుతోన్న ప్రచారాన్ని ఈవో శ్యామలరావు కొట్టిపారేశారు టీటీడీలో సమన్వయ లోపం లేదని స్పష్టం చేసిన ఆయన.. టీటీడీలో చైర్మన్ కీలకం.. పాలకమండలిలో చర్చించి తీసుకున్న నిర్ణయాలు అమలు చేశాం అన్నారు. అయితే, బైరాగిప్టటెడ లో భక్తులను అనుమతించే సమయంలో ప్రోటోకాల్ మేరకు విధానం పాటించలేదన్నారు.. చైర్మన్ కి నాకు మధ్య ఎలాంటి విభేదాలు లేవు.. ఆరు నెలలుగా ఎన్నో మంచి పనులు చేశాం.. వాటిని పక్కన పెట్టేసి తొక్కిసలాట ఘటన పైనే విమర్శలు చేస్తున్నారని టీటీడీ ఈవో శ్యామలరావు ఆవేదన వ్యక్తం చేశారు.తిరుమలలో ప్రతి భక్తుడికి నాణ్యమైన సేవలు అందించేందుకు గత ఆరు నెలలుగా అనేక సంస్కరణలు తీసుకువస్తున్నామని అడిషనల్ ఈవో శ్రీ సిహెచ్ వెంకయ్య చౌదరి తెలిపారు. దాతల విభాగాన్ని పూర్తిగా ఆడిట్ చేయించి అర్హులైన దాతలకు సేవలు అందేలా, మధ్యవర్తులను పూర్తిగా నిషేధించేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. భక్తులకు వసతి ఎవరికి కేయించాలో తెలియని అగమ్య పరిస్థితి నుంచి మరింత పూర్తి పారదర్శకంగా వసతి గదులు కేటాయిస్తున్నామన్నారు. రాబోవు రోజులలో వసతి గదులు కేటాయింపులో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా భక్తుల వాట్సాప్ కే పూర్తి సమాచారం, రిజిస్ట్రేషన్ చేసే ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఇటీవల భక్తులు ఎక్కువ సేపు వేచియుండకుండా శ్రీవారి దర్శనం కల్పిస్తున్నామని అన్నారు. విచక్షణ కోటాను , మానవ జోక్యాలను తగ్గించి భక్తులకు త్వరతిగతిన దర్శనం చేసేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. వైకుంఠ ఏకాదశి, ద్వాదశి సందర్భంగా తిరుమల శ్రీవారి దర్శనాన్ని అన్ని తరగతుల వారికి భేషుగ్గా ఏర్పాటు చేశామన్నారు.

# ఎన్నికల నిర్వహణ హామీ నిలబెట్టుకున్నమోడీ

- కాశ్మీర్‌లోప్రశాంతంగా ఎన్నికలతో సిఎంను అయ్యా
- ప్రధాని మోడీపై ప్రశంసలు కురిపించిన ఒమర్ అబ్దుల్లా



**శ్రీనగర్, ప్రజాభూమి**

జమ్మూకశ్మీర్‌లో ఎన్నికలు నిర్వహిస్తామని హామీ ఇచ్చినట్లుగానే ప్రధాని మోడీ విజయవంతంగా ఎన్నికలు నిర్వహించారని జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా అన్నారు. ఈ మేరకు ప్రధాని నరేంద్ర మోదీని కొనియాడారు. మోదీ మూడోసారి ప్రధానిగా అధికారం చేపట్టిన తర్వాత శ్రీనగర్‌లో జరిగిన అంతర్జాతీయ యోగా దినోత్సవంలో పాల్గొన్నారని గుర్తు చేసుకున్నారు. అప్పుడే కశ్మీర్‌లో ఎన్నికలు నిర్వహిస్తామని ప్రజలకు వాగ్దానం చేశారని అన్నారు. అన్నట్లుగానే నాలుగు నెలలలోపు జమ్మూకశ్మీర్‌లో ఎన్నికలు జరిగి కొత్త ప్రభుత్వం ఏర్పాటయ్యిందని పేర్కొన్నారు. దాని ఫలితంగానే నేడు తాను ముఖ్యమంత్రి పదవిలో ఉన్నానన్నారు. జమ్మూ కశ్మీర్ ఎన్నికల్లో అన్ని ప్రాంతాల ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారని.. ఎక్కడా రిగ్గింగ్, అధికార దుర్వినియోగం జరిగినట్లు ఫిర్యాదులు లేవని పేర్కొన్నారు. అదే విధంగా జమ్మూ కాశ్మీర్‌కు రాష్ట్ర హోదాను పునరుద్ధరిస్తానని ఇచ్చిన హామీని ప్రధాని త్వరలో నెరవేరుస్తారని నమ్ముతున్నానని అన్నారు. మళ్లీ భారత దేశంలోని ఒక రాష్ట్రంగా జమ్మూకశ్మీర్ అవతరిస్తుందని అన్నారు. ప్రధాని మోదీ కృషి వల్ల సరిహద్దుల్లో శాంతిభద్రతలు కొలిక్కి వచ్చాయని ఒమర్ అన్నారు. పర్యటకపరంగా కూడా కశ్మీర్ అభివృద్ధి చెందుతోందని తెలిపారు. శ్రీనగర్-లేహ్ జాతీయ రహదారిపై సోన్‌మార్గ్ ప్రాంతంలో నిర్మితమైన జడ్-మోడ్ సొరంగాన్ని నేడు ప్రధాని మోదీ ప్రారంభించడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. ఈ సొరంగం ప్రారంభంతో ఎగువ ప్రాంతాల ప్రజలు ఇకపై మైదాన ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం ఉండదని.. ఏడాదిలో ఏ సీజన్‌లోనైనా లద్దాఖ్‌ను రహదారి మార్గం ద్వారా చేరుకోవడానికి వీలవుతుందని అన్నారు. దీనివల్ల సోన్‌మార్గ్‌కు పర్యటకుల రాక కూడా పెరగనుందని పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికల సమయంలో జమ్మూకశ్మీర్‌లో పర్యటించిన ప్రధాని నరేంద్ర మోదీ అక్కడి ప్రజల అభివృద్ధి కోసం పాటుపడతానని హామీ ఇచ్చారు. జమ్మూకశ్మీర్‌ను మళ్లీ రాష్ట్రంగా మారుస్తామని అన్నారు. కశ్మీర్ యువత చేతిలో రాళ్లను వదిలేసి విద్య, అభివృద్ధి వైపు వెళ్లాలని ఎదురు చూస్తున్నారని అన్నారు.

# తిరువాభరణం యాత్ర ప్రారంభం

- నేడు మకరవిళక్కు రోజు అయ్యప్పకు అలంకరణ

**తిరువనంతపురం, ప్రజాభూమి**



స్వామి అయ్యప్ప పవిత్ర ఆభరణాలు 'తిరువాభరణం' తీసుకువెళ్లే వార్షిక ఉత్సవ యాత్ర ఆదివారం పథనంథిట్టలోని పందలంలో ఒక ఆలయంలో నుంచి శబరిమలకు బయలుదేరింది. ఆ పవిత్ర ఆభరణాలను ఈ నెల 14న, 'మకరవిళక్కు' ఉత్సవం రోజు స్వామి అయ్యప్పకు అలంకరించనున్నారు. ట్రావన్‌కూర్ దేవస్వమ్ బోర్డ్ (టిడిబి) ప్రతినిధులతో పాటు అనేక మంది అయ్యప్ప భక్తులు కూడా 'తిరువాభరణం ఘోషాయాత్ర' వెంట శబరిమల ఆలయానికి సాగారు.

దశాబ్దాలుగా పాటిస్తున్న సంప్రదాయం ప్రకారం, పందలంలోని స్రాంబిక్కల్ ప్యాలెస్‌లోని ఖజానా నుంచి పక్రనే ఉన్న వలియకోయిక్కల్ సస్థ ఆలయానికి ఉదయం భక్తుల దర్శనార్థం తిరువాభరణాన్ని తరలించారు. టిడిబి అధికారులు ప్యాలెస్ అధికారుల నుంచి ఆభరణాలు స్వీకరించి సస్థ ఆలయానికి తీసుకువెళ్లారు. వాటిని తిలకించి, పూజలు చేసేందుకు అనేక మంది భక్తులు అక్కడికి చేరారు. 'స్వామియే శరణం అయ్యప్ప' ఉచ్ఛాటనల మధ్య సాంప్రదాయక తంతు, పూజలు నిర్వహించిన తదుపరి పవిత్ర ఆభరణాలను చెక్క పేటికలలో పెట్టి శబరిమలకు తీసుకువెళ్లారు.

# ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాయంతో ఇచ్చిమొచ్చినట్లు క్రియేట్

- ప్రముఖుల ఫొటోలను మార్ఫింగ్
- తాజాగా జాన్వీకపూర్, హర్దిక్‌పాండ్యా క్లోజ్‌గా ఉన్నట్లు వైరల్



**న్యూఢిల్లీ, ప్రజాభూమి**

ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ సాయంతో కొందరు ఇచ్చిమొచ్చినట్లుగా ప్రముఖుల ఫొటోలను మార్ఫింగ్ చేసి నెట్టింట్లో పోస్టు చేస్తున్నారు. దీంతో దానిని చూసిన నెటిజన్లు అది నిజమోనని ఆరా తీయడం మొదలు పెడుతున్నారు. ఇది ఈ మధ్యకాలంలో బాగా పెరిగింది. ఇందుకు ప్రధాన కారణంగా ఎఐ ఆర్టిఫిషియల్ ఇంకా మరింత అభివృద్ధి చెందటమే కారణంగా.ఈ నేపథ్యంలో క్రికెటర్ హార్దిక్ పాండ్యా, స్టార్ నటి జాన్వీ కపూర్ డేటింగ్‌లో ఉన్నారంటూ సోషల్ మీడియాలో తెగ ప్రచారం జరుగుతోంది. అందుకు కారణం ఇద్దరూ చనువుగా ఉన్న ఫొటోలు వైరల్ కావడమే. వీరిద్దరూ కలిసి ఇటీవలే మాల్దీవుల్లో విహరించినట్లు ఆ ఫొటోలను బట్టి తెలుస్తోంది. జాన్వీ-పాండ్యా సముద్ర తీరంలో విహరిస్తూ, సన్నిహితంగా కనిపించారు. ఈ ఫొటోలను చూసిన నెటిజన్లు హార్దిక్ జాన్వీ పీకల్లోతు ప్రేమలో ఉన్నారంటూ మాట్లాడుకోవడం మొదలు పెట్టారు. దీంతో రంగంలోకి దిగిన నేషనల్ మీడియా ఫ్యాక్ట్ చెక్ నిర్వహించగా అసలు విషయం బయటపడింది. ఈ ఫొటోలు నిజం కాదని తేల్చింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాయంతో క్రియేట్ చేసినవిగా తేల్చింది. దీంతో వీరిద్దరూ డేటింగ్‌లో ఉన్నారంటూ వచ్చిన వార్తలు కేవలం పుకార్లు మాత్రమే అని స్పష్టమైంది. కాగా, హార్దిక్ పాండ్యా ఇటీవలే తన భార్య నటాషా స్టాంకోవిక్‌తో విడాకులు తీసుకున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం తన దృష్టిమొత్తం కెరీర్‌పైనే పెట్టాడు. ఇక జాన్వీ కపూర్ వరుస బాలీవుడ్ ప్రాజెక్టులతోపాటు టాలీవుడ్ సినిమాలతో బిజీగా మారిపోయింది.

# యువ ఉడాన్ యోజన్ పేరుతో మరో హామీ

- ఢిల్లీ గెలుపు కోసం కాంగ్రెస్ ఎత్తులు



**న్యూఢిల్లీ,ప్రజాభూమి**

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధిస్తే ఏడాదిపాటు ఢిల్లీలోని నిరుద్యోగ యువతకు రూ.8,500 ఇస్తామని కాంగ్రెస్ పార్టీ మరో హామీని ప్రకటించింది. 'యువ ఉడాన్ యోజన' ద్వారా ఆర్థికసాయాన్ని అందించనున్నట్లు వెల్లడించింది. అయితే ఈ పథకం ఉచితం కాదని, షరతులు వర్తిస్తాయని పేర్కొంది. 'ఏదైనా కంపెనీ లేదా ఫ్యాక్టరీలో తమకు ఉన్న నైపుణ్యాలను చూపించిన యువతకు ఆర్థిక సాయం చేస్తాం. వారు ఈ కంపెనీల నుంచి ఆ సొమ్మును పొందుతారు. ఇది ఇళ్లల్లో ఖాళీగా కూర్చొనేవారికి ఉచితంగా సొమ్ములు ఇచ్చే పథకం కాదు. ప్రజలు శిక్షణపొందిన రంగాల్లో స్థిరపడేలా సాయం చేయడానికే ఈ పథకం తెచ్చాం' అని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి సచిన్ పైలట్ వెల్లడించారు. మాజీ ముఖ్యమంత్రి షీలా దీక్షిత్ తన 15ఏళ్ల పాలనలో చేసిన అభివృద్ధి, కొత్త పథకాలను, విధానాలను చూపి ఎన్నికల బరిలోకి దిగుతున్నట్లు కాంగ్రెస్ తెలిపింది.

# కుంభమేళాకు హాజరైన ఆపిల్ సహ వ్యవస్థాపకులు దివంగత స్టీవ్ జాబ్స్ భార్య

**ప్రయాగ్‌రాజ్, ప్రజాభూమి**



ఆపిల్ సహ వ్యవస్థాపకులు దివంగత స్టీవ్ జాబ్స్ భార్య, ప్రపంచంలో అత్యంత ధనవంతురాలైన మహిళల్లో ఒకరైన లారెన్ పావెల్ మహా కుంభమేళాకు హాజరయ్యారు. 40 మంది సభ్యులతో కూడిన బృందంతో ఆమె ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌కు తరలివచ్చారు. రెండు రోజుల క్రితమే (ఈ నెల 11న) భారత్‌కు చేరుకున్న 61 ఏండ్ల లారెన్.. నిరంజని అఖాడాకు చెందిన ఆచార్య మహామండలేశ్వర్ స్వామి కైలాషానంద శిబిరంలో ఉన్నారు. ఆదివారం సాయంత్రం ప్రయాగ్‌రాజ్‌కు వచ్చిన ఆమెకు శిబిరం వద్ద స్వామీజీలు ఘనంగా స్వాగతం పలికారు. లేత పసుపు వర్ణంలో వస్త్రాలు ధరినంచిన లారెన్.. చేతికి రక్షా సూత్ర, మెడలో రుద్రాక్ష మాల ధరించి ఉన్నారు. ఆమె ఈ నెల 15 వరకు అక్కడే ఉంటారు. అనంతరం నూతన అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రమాణ స్వీకారం కార్యక్రమంలో పాల్గొనేందుకు అమెరికాకు తిరిగి వెళ్లనున్నారు. ప్రయాగ్‌రాజ్ రావడానికి ముందు వారణాసిలోని కాశి విశ్వనాథ ఆలయాన్ని సందర్శించారు. లారెన్ పావెల్.. ప్రపంచంలోని అత్యంత సంపన్న మహిళల్లో ఒకరు. ఆమె ఆస్తి 15 బిలియన్ల డాలర్లు. స్టీవ్ జాబ్స్ భార్య అయిన లారెన్ పావెల్ యాపిల్ కంపెనీ షేర్స్ నుంచి ఆస్తిని వారసత్వంగా పొందారు. 2021లో ఆమె వేవెర్లీ స్ట్రీట్ ఫౌండేషన్‌ను ప్రారంభించారు. దీనికి వచ్చే నిధులను పర్యావరణ మార్పులను పరిష్కరించేందుకు కేటాయిస్తున్నారు. ఆపిల్ వ్యవస్థాపకుల్లో ఒకరైన స్టీవ్ జాబ్స్ 2011, అక్టోబర్ 5న మరణించిన విషయం తెలిసిందే.

# ఈ ప్రభుత్వం ఆయువు నాలుగు నెలలే

## - జాగ్రత్తగా ఉండు.. అంటూ సిఐకి జగన్ హెచ్చరిక



కడప,ప్రజాభూమి

పులివెందుల డీఎస్పీ మురళీ నాయక్‌పై వైకాపా అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ బెదిరింపులకు దిగారు. 'ఈ ప్రభుత్వం రెండు లేదా నాలుగు నెలల్లో మారిపోవచ్చు.. ఆ తర్వాత మీ కథ ఉంటుంది' అని హెచ్చరించారు. జగన్ సమీప బంధువు వైఎస్ అభిషేక్‌రెడ్డి అంత్యక్రియలు పులివెందులలో శనివారం జరిగాయి. ఈ కార్యక్రమానికి హాజరైన జగన్ తిరుగు ప్రయాణంలో హెలిప్యాడ్‌కు చేరుకున్నారు. వివిధ విచారణల్లో భాగంగా డీఎస్పీ దూకుడు ప్రదర్శిస్తున్నారని జగన్ వద్ద వైకాపా నేతలు ప్రస్తావించారు. హెలిప్యాడ్ వద్ద ఆగిన జగన్.. డీఎస్పీని పిలిపించారు. డీఎస్పీ మరో ఇద్దరు సీఐలతో జగన్ వద్దకు వెళ్లారు. ఆయన్ను ఉద్దేశించి జగన్ తీవ్ర స్వరంతో మాట్లాడుతూ... జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. డీఎస్పీ మౌనంగా విని, అక్కడి నుంచి వెళ్లిపోయారు. రిమాండ్ ఖైదీ వర్రా రవీందర్‌రెడ్డిని ఇటీవల రెండు రోజుల కస్టడీలో విచారించారు. కడప ఎంపీ అవినాష్‌రెడ్డి పీఏ రాఘవరెడ్డికి 41ఏ నోటీసు ఇచ్చి పలుమార్లు విచారించారు. వీరందరినీ డీఎస్పీనే విచారిస్తూ వివరాలు రాబట్టే ప్రయత్నం చేస్తున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు డీఎస్పీ తన బాధ్యతలను నిర్వహిస్తుండగా అందరిముందు బెదిరించడం పోలీసుశాఖలో చర్చనీయాంశమైంది.

# ప్రజలు సుఖసంతోషాలతో విరాజిల్లాలి

## - పవన్ కళ్యాణ్ సంక్రాంతి శుభాకాంక్షలు



అమరావతి, ప్రజాభూమి

ప్రజలు సుఖసంతోషాలతో విరాజిల్లాలని, డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్ తెలుగు ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. పండుగ సందడితో తెలుగు రాష్ట్రాలు పల్లెలు శోభాయమానంగా మారాయని ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. 'సూర్య భగవానుడు మకర రాశిలోకి ప్రవేశించే ఈ పుణ్య సమయాన ధాన్య రాశులను లోగిళ్లకు మోసుకువచ్చే సంక్రాంతి వేళ భారతీయులందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు. రంగవల్లులు..గొబ్బెమ్మలు.. గంగిరెద్దులు.. హరిదాసులు.. భోగిమంటలు.. పిండివంటల సమ్మేళనమే సరదాల సంక్రాంతి. అలాంటి సరదాల కోసం నగరాలన్నీ ప్లలెలవైపు పరుగులు తీశాయి. ఇది ప్రజలకు పండుగపై ఉన్న మక్కువను తెలియజేస్తోంది. ఉపాధికోసం ప్లలె బిడ్డలు నగరాలకు వలసపోవడంతో గ్రామా లు జనాలు లేక కొంతవరకు పలుచబడ్డాయి. ఈ సంక్రాంతి పండుగ వేళ ప్లలెలు పిల్లాపాపలతో కళకళలాడుతుంటే సంతోషంగా ఉంది.. ప్లలె సౌభాగ్యమే దేశ సౌభాగ్యం. ఆనందాలు, సిరి సంపదలతో ప్లలెలు సుభిక్షంగా శోభిల్లాలని, తెలుగు రాష్ట్రాల ప్రజలు సుఖసంతోషాలతో విరాజిల్లాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను' అని పవన్ కల్యాణ్ తెలిపారు. సొంతూరు సంక్రాంతి వేడుకల్లో బాబు కుటుంబం

# ప్రజలకు పండగ శుభాకాంక్షలు తెలిపిన చంద్రబాబు



చిత్తూరు, ప్రజాభూమి

చిత్తూరు జిల్లా నారావారిప్లలెలోని సంక్రాంతి వేడుకల్లో సీఎం చంద్రబాబు కుటుంబం సందడి చేస్తోంది. గ్రామంలోని మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ అందమైన రంగవల్లులను ముఖ్యమంత్రి చంద్రబాబు, భువనేశ్వరి బ్రాహ్మణి లు కలిసి పరిశీలించారు. ఈ ముగ్గుల పోటీల్లో 126 మంది మహిళలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నారా భువనేశ్వరి మాట్లాడుతూ అందరికీ భోగి, సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. పోటీల్లో భాగంగా రంగవల్లులు తీర్చిదిద్దిన వారందరికీ రూ.10,116 చొప్పున కానుక ఇస్తున్నట్లు తెలిపారు. అందరికీ సుఖ సంతోషాలు కలగాలని ఆకాంక్షించారు. పిల్లలకు నిర్వహించిన వివిధ రకాల పోటీలను చంద్రబాబు చూసి ఆనందించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్ర ప్రజలందరికి భోగి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా వేదికగా పోస్టు చేశారు. 'పవిత్రమైన ఈ భోగి పండుగ మీకు, మీ కుటుంబానికి కొత్త వెలుగులు తేవాలని, పాత బాధలు పోయి సానుకూల దృక్పథంతో జీవితంలో ముందుకు సాగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. భోగి మంటలతో మీ సమస్యలన్నీ తీరిపోయి మీకు భోగ భాగ్యాలు కలగాలని ఆకాంక్షిస్తున్నాను. మీ ఆశలు, ఆశయాలూ తీర్చడానికి ప్రజాప్రతినిధులుగా మేం అన్ని వేళలా మీతోనే ఉంటామని ఈ సందర్భంగా హామీ ఇస్తున్నాను. మీ అందరికి భోగి పండుగ శుభాకాంక్షలు.' అంటూ పోస్ట్ లో పేర్కొన్నారు.

# భారీ నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

## - వెయికి పైగా పాయింట్లు నష్టపోయిన సెన్సెక్స్




ముంబయి, ప్రజాభూమి

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు సోమవారం భారీ నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్లో బలహీన సంకేతాల నడుమ ఉదయం నష్టాల్లో ప్రారంభమైన సూచీలు రోజంతా అదే బాటలో పయనించాయి. ముఖ్యంగా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, జొమాటో, ఎల్‌అండ్‌టీ షేర్లలో విక్రయాలు సూచీలపై మరింత ఒత్తిడి పెంచాయి. దీంతో సెన్సెక్స్ 1,000 పాయింట్లకు పైగా పడిపోగా.. నిఫ్టీ 23,100 దిగువన ముగిసింది. సెన్సెక్స్ ఉదయం 76,629.90 (క్రితం ముగింపు 77,378.91) వద్ద నష్టాల్లో ప్రారంభమైంది. రోజంతా నష్టాల్లోనే కదలాడింది. ఇంట్రాడేలో 1000 పాయింట్లు పైగా కోల్పోయి 76,249.72 వద్ద కనిష్ఠాన్ని తాకింది. చివరికి 1,048.90 పాయింట్ల నష్టంతో 76,330.01 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 345.55 పాయింట్ల నష్టంతో 23,085 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 86.61 వద్ద స్థిరపడింది. భారత్‌లో యాపిల్ జోరు.. 2024లో రూ.లక్ష కోట్లు దాటిన ఐఫోన్ ఎగుమతులు .సెన్సెక్స్ 30 (ౌఇఔౌఇ- 30) సూచీలో జొమాటో, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, అదానీ పోర్ట్స్, టాటా స్టీల్, ఎన్టీపీసీ, టాటా మోటార్స్, ఎంఅండ్ఎం, ఏషియన్ పెయింట్స్, అల్ట్రాటెక్ సిమెంట్ షేర్లు నష్టపోయాయి. టీసీఎస్, ఇండస్ ఇండ్ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, హెచ్‌యూఎల్ షేర్లు మాత్రమే లాభపడ్డాయి. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 80.83 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. బంగారం ఔన్సు 2,708.10 డాలర్ల వద్ద కొనసాగుతోంది. ఆసియా మార్కెట్ల నుంచి బలహీన సంకేతాలు కూడా మన మార్కెట్లపై ప్రభావం చూపాయి. జపాన్ నిక్కీ, హాంకాంగ్, ఏఎస్ఎక్స్ మార్కెట్లు 1 శాతం మేర నష్టాల్లో ముగిశాయి. దేశీయ ఈక్విటీ మార్కెట్లలో ఎఫ్ఐఐల అమ్మకాలు కొనసాగుతుండడం మన మార్కెట్లలో అమ్మకాల ఒత్తిడికి కారణమని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. అమెరికా బాండ్ రాబడులు పెరగడం కూడా మరో కారణమంటున్నారు. అమెరికా డాలర్‌తో పోలిస్తే రూపాయి రోజురోజుకూ బక్కచిక్కిపోతోంది. సోమవారం 86.61 వద్ద స్థిరపడింది. రూపాయి క్షీణత ఇలాగే కొనసాగితే దిగుమతులపై ఎక్కువగా ఆధారపడే మన దేశానికి ఇబ్బందులు తప్పవు. వాణిజ్యలోటు, కరెంటు ఖాతా లోటు, ద్రవ్యోల్బణం పెరిగేందుకు దారితీయొచ్చు. ఇది పెట్టుబడిదారుల సెంటిమెంట్‌ను దెబ్బతీసే అవకాశాలున్నాయి.

# కోడి పందాలను ప్రారంభించిన డిప్యూటి స్పీకర్



విజయవాడ, ప్రజాభూమి

సంక్రాంతి సంబరాల్లో భాగంగా ఏపీలోని పలు ప్రాంతాల్లో కోడి పందేలు నిర్వహిస్తున్నారు. కృష్ణా జిల్లా గన్నవరం నియోజకవర్గంలోని సూరంపల్లి, రామవరప్పాడు, అంపా పురంలో వీటిని నిర్వహించారు. పల్లెల్లోని బరుల్లోనూ పందేలు ఏర్పాటు చేశారు. వీటిని చూసేందుకు ప్రజలు భారీగా తరలివచ్చారు. ఎన్టీఆర్ జిల్లా నందిగామ నియోజ కవర్గంలో కోడి పందేలు జోరుగా సాగుతున్నాయి. నందిగామ, చందర్లపాడులో ఈ పోటీలు సాగుతున్నాయి. కంచికచర్ల మండలం గండేపల్లి వద్ద టెంట్లు ఏర్పాటు చేసి భారీ ఎత్తున పందేలు నిర్వహిస్తున్నారు. పశ్చిమ గోదావరి జిల్లా కాళ్ల మండలం పెదఅమిరంలో కోడి పందేలను డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణ రాజు ప్రారంభించారు.

# కేరళ స్వతంత్ర ఎమ్మెల్యే అన్వర్ రాజీనామా



తిరువనంతపురం, ప్రజాభూమి

కేరళలోని నిలంబూర్ నియోజకవర్గానికి చెందిన స్వతంత్ర ఎమ్మెల్యే పి.వి. అన్వర్ రాజీనామా చేశారు. సోమవారం కేరళ స్పీకర్ ఎ.ఎన్.శ్యాంసీర్‌కి తన రాజీనామా లేఖను అందజేశారు. కోల్‌కతా టిఎంసి నేతలతో సమావేశమైన కొద్ది రోజుల అనంతరం అన్వర్ ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం. కేరళలో పార్టీ కార్యకలాపాలను సమన్వయం చేస్తానని అన్వర్ చెప్పారు. అయితే టిఎంసి సభ్యత్వాన్ని ఆమోదిస్తున్నారా లేదా అనే వివరాలను వెల్లడించకుండా దాటవేశారు. తన అసెంబ్లీ సీటును కోల్పోవడంతో పాటు ఫిరాయింపుల నిరోధక చట్టం కింద చట్టపరమైన చర్యలను తప్పించు కునేందుకు ఈ వివరాలను వెల్లడించకపోవచ్చని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. కేరళ స్టూడెంట్స్ యూనియన్ (కెఎస్‌యు) నేతగా రాజకీయ జీవితాన్ని ప్రారంభించిన అన్వర్ కాంగ్రెస్‌లో చేరారు. 2005లో కాంగ్రెస్‌కు గుడ్‌బై చెప్పి కె. కరుణాకరన్‌కి చెందిన డెమోక్రటిక్ ఇందిరా కాంగ్రెస్ (కరుణాకరన్)తో పొత్తు పెట్టుకున్నారు. అనంతరం ఎల్‌డిఎఫ్‌తో చేతులు కలిపారు. అధికార ఫ్రంట్ స్వతంత్ర అభ్యర్థిగా నిలంబూర్ నుండి రెండుసార్లు గెలిచారు.

### గత ఏడాదిలో హతమైన ఉగ్రవాదుల్లో

# పాకిస్తానీయులే ఎక్కువ : ఆర్మీచీఫ్



న్యూఢిల్లీ, ప్రజాభూమి

గతేడాది హతమైన ఉగ్రవాదుల్లో 60 శాతం మంది పాకిస్తాన్ సంతతికి చెందిన వారేనని ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది పేర్కొన్నారు. హింసను ప్రేరేపించేందుకు పాకిస్తాన్ పాత్ర ఏంటో ఈ చర్యతో తెలిసి పోతుందన్నారు. జనవరి 15వ తేదీన ఆర్మీ డే సందర్భంగా ఆర్మీ చీఫ్ జనరల్ సోమవారం మీడియాతో మాట్లాడారు. పాకిస్తాన్‌లోని ఉగ్రవాదులు జమ్మూకశ్మీర్‌లో హింసను ప్రేరేపిస్తున్నారని తెలిపారు. ఉగ్రవాద చర్యలను నిరోధించేందుకు గతేడాది 15 వేల మంది సైనికులను చేర్చుకుకోవడంతో ఎంతో దోహదపడిందని పేర్కొన్నారు. జమ్మూకశ్మీర్‌లో పర్యాటకం అభివృద్ధి చెందుతున్న సమయంలోనే ఉగ్రవాదులు తమ చర్యలను వేగం చేశారు. ఈ ఉగ్రవాదుల్లో 80 శాతం మంది పాకిస్తానీలు ఉన్నారని, గతేడాది 60 శాతం మందిని అంతమొందించామని తెలిపారు.

ఇక భారత్, చైనా సైన్యాల మధ్య విశ్వాసాన్ని పునరుద్ధరించడానికి ప్రయత్నాలు అవసరమని పేర్కొన్నారు. సరిహద్దుల్లో ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. సరిహద్దుల్లో మౌలిక సదుపాయాలు పెంచడం, కెపబిలిటీ డెవలప్‌మెంట్‌పై దృష్టి సారించామని తెలిపారు. చొరబాటు ప్రయత్నాలను అడ్డుకుంటున్నామని ఆర్మీ చీఫ్ స్పష్టం చేశారు.

# తిరుమల రెండవ ఘాట్ రోడ్డులో ప్రమాదం

## - అదుపుతప్పి గోడను ఢీకొన్న బస్సు




తిరుమల, ప్రజాభూమి

తిరుమల రెండవ ఘాట్ రోడ్డులో ప్రమాదం చోటు చేసుకుంది. సోమవారం నాడు హరిణి వద్ద ఆర్టీసీ బస్సు అదుపు తప్పి గోడను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న పలువురు భక్తులు, ఉద్యోగులకు గాయాలయ్యాయి. బస్సు రోడ్డుకు అడ్డంగా నిలిచిపోవడంతో ఘాట్ రోడ్డులో భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. దీంతో దాదాపు ఎనిమిది కిలో మీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. విషయం తెలిసిన వెంటనే పోలీసులు, టీటీడీ విజిలెన్స్ అధికారులు హుటాహుటిన అక్కడకు చేరుకుని బస్సును రోడ్డుకు అడ్డం తొలగించేందుకు ప్రయత్నిస్తున్నారు. క్రేన్‌తో బస్సును తొలగించేందుకు సిబ్బంది ప్రయత్నిస్తున్నారు. తిరుమలలో సోమవారం భారీగా వర్షం కురిసింది. ఈ నేపథ్యంలో ఘాట్ రోడ్డులో వస్తున్న ఆర్టీసీ బస్సు 12వ కిలోమీటర్ వద్ద హరిణికి సమీపంలో బ్రేక్ వేయడంతో అదుపుతప్పి అక్కడే ఉన్న రక్షణ గోడను ఢీకొట్టింది. బస్సులో ప్రయాణిస్తున్న ప్రయాణికులు, ఉద్యోగులకు తీవ్ర గాయాలయ్యాయి. బస్సు రక్షణ గోడను ఢీకొట్టిన నేపథ్యంలో బస్సు పూర్తిగా రోడ్డుకు అడ్డంగా తిరిగిపోయింది. దీంతో భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. మరికాసేపట్లో రోడ్డుకు అడ్డంగా ఉన్న బస్సును తొలగించి ట్రాఫిక్‌ను క్లియర్ చేసేందుకు సిబ్బంది ప్రయత్నిస్తున్నారు. అయితే బస్సులో ప్రయాణిస్తున్న భక్తుల్లో కొంతమందికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వారిని తిరుపతిలోని రుయా ఆస్పత్రికి సిబ్బంది తరలించారు. వారికి రుయా ఆస్పత్రిలో చికిత్స కొనసాగుతోంది. తిరుమలలో వర్షం కారణంగా ఘాట్‌లో రోడ్డుపై వెళ్లే వాహనాల్లో ఆయిల్ రహదారిపై పడటంతో అదే సమయంలో అక్కడకు వచ్చిన ఆర్టీసీ బస్సు డ్రైవర్ బ్రేక్ కొట్టగా.. బ్రేక్ ఫెయిల్యూర్ అయ్యే ఈ ప్రమాదం చోటు చేసుకుందని ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చింది. అయితే ప్రమాదానికి గల పూర్తి కారణాలను అధికారులు వెల్లడించాల్సి ఉంటుంది. అయితే బస్సు డ్రైవర్ వేగంగా నడపడం, బ్రేక్ వేయడం వల్ల ప్రమాదం జరిగిందని బస్సులో ప్రయాణిస్తున్న ప్రయాణికులు చెబుతున్న మాట. ఈ ఘటనలో బస్సు డ్రైవర్‌కు కూడా గాయాలయ్యాయి. బస్సులో ముందు వరసగా ఉన్న వారు తీవ్రంగా గాయపడగా.. వెనక కూర్చున వారు స్వల్పంగా గాయపడ్డారు. సడన్‌గా బ్రేక్ కొట్టడం వల్లే బస్సులో ముందు ఉన్న రాడ్‌కు కొట్టడంతో చాలా మందికి మూతిపైనే గాయాలయ్యాయి. బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంగా కూడా ప్రమాదానికి కారణంగా తెలుస్తోంది.

# ఈ సారి పాక్ చేతిలో భారత్‌కు ఓటమి తప్పదు

## పాకిస్థాన్ మాజీ పేసర్ మహమ్మద్ అమీర్




ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ 2025 ప్రారంభానికి ముందే భారత జట్టును పాకిస్థాన్ మాజీ పేసర్ మహమ్మద్ అమీర్ హెచ్చరించాడు. ఈ సారి పాకిస్థాన్ జట్టు చేతిలో భారత్‌కు ఓటమి తప్పదని అభిప్రాయపడ్డాడు. ఇటీవల పరిమిత ఓవర్ల క్రికెట్‌లో పాకిస్థాన్ మెరుగ్గా రాణిస్తుందని, వరుస విజయాలతో జోరు మీద ఉందని తెలిపాడు. మరోవైపు భారత్ పేలవ ప్రదర్శనతో చతికిలపడిందని, తీవ్ర ఒత్తిడిలో ఉందన్నాడు. ఈ క్రమంలోనే భారత్‌పై పాకిస్థాన్ పై చేయి సాధిస్తుందని అంచనా వేసాడు. 2017 ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్లో మహమ్మద్ అమీర్ సంచలన బౌలింగ్‌తో భారత్ పతనాన్ని శాసించాడు. అయితే గత రెండేళ్లుగా ఐసీసీ టోర్నీల్లో పాకిస్థాన్ దారుణంగా విఫలమైంది. ఆసియా కప్ 2023, వన్డే ప్రపంచకప్ 2023తో పాటు టీ20 ప్రపంచకప్ 2024ల్లో ఘోర పరాజయాలను చవిచూసింది. దాంతో ఆ జట్టులో తీవ్ర మార్పులు జరిగాయి. కెప్టెన్లు, కోచ్‌లు మారారు. ప్రస్తుతం పరిమిత ఓవర్లలో పాకిస్థాన్ జట్టును వికెట్ కీపర్ మహమ్మద్ రిజ్వాన్ నడిపిస్తున్నాడు. అతను సారథ్య బాధ్యతలు చేపట్టిన తర్వాత పాక్ మళ్లీ విజయాల బాట పట్టింది. ఆస్ట్రేలియా గడ్డపై వన్డే సిరీస్ గెలిచిన పాక్.. సౌతాఫ్రికా పర్యటనలో మూడు వన్డేల సిరీస్‌ను క్లీన్ స్వీప్ చేసింది. మరోవైపు గత మూడు నెలల్లో భారత్ ఘోర పరాజయాలను చవిచూసింది. శ్రీలంకతో మూడు వన్డేల సిరీస్ కోల్పోవడంతో పాటు.. న్యూజిలాండ్‌తో సొంతగడ్డపై మూడు టెస్ట్‌ల సిరీస్‌లో క్లీన్ స్వీప్ అయ్యింది. ఆస్ట్రేలియాతో ఐదు టెస్ట్‌ల బోర్డర్ గవాస్కర్ ట్రోఫీని 1-3తో కోల్పోయింది. దాంతో టీమిండియాపై తీవ్ర విమర్శలు వచ్చాయి. ఇదే అంశాన్ని ప్రస్తావించిన మహమ్మద్ అమీర్.. ప్రస్తుతం భారత్ తీవ్ర ఒత్తిడిలో ఉందని, పాకిస్థాన్‌కు కలిసొచ్చే అంశమని అభిప్రాయపడ్డాడు. 'ఇటీవల పాకిస్థాన్ అద్భుతంగా ఆడుతోంది. ఆస్ట్రేలియా, సౌతాఫ్రికాలను వారి సొంతగడ్డపై ఓడించింది. ఇదే పాక్ బలాన్ని తెలియజేస్తోంది. ముఖ్యంగా ఓవర్‌సీస్ కండిషన్స్‌లో పాకిస్థాన్‌కు తిరుగులేదు. ఇటీవల పాకిస్థాన్ జట్టు ప్రదర్శనను పరిగణలోకి తీసుకుంటే ఛాంపియన్స్ ట్రోఫీలో భారత్‌పై పై చేయి సాధిస్తోందని అనిపిస్తోంది. అయితే మెగాటోర్నీల్లో టీమిండియానే ఎప్పటికీ నా ఫేవరేట్. కానీ ఈసారి టీమిండియా తీవ్ర ఒత్తిడిలో ఉంది. వరుస పరాజయాలతో తీవ్ర విమర్శలను ఎదుర్కొంటుంది. జస్‌ప్రీత్ బుమ్రా కూడా అందుబాటులోకి లేకపోతే భారత్ మరిన్ని కష్టాలను ఎదుర్కోనుంది. భారత్ తరఫున అతనే టాప్ బౌలర్. టీమిండియా పేస్ విభాగాన్ని ముందుండి నడిపించేవాడు. అతను లేకపోతే భారత బౌలింగ్ బలం 40-50 శాతం తగ్గనుంది.'అని మహమ్మద్ అమీర్ చెప్పుకొచ్చాడు. ఇటీవల ముగిసిన బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో బుమ్రా అసాధారణ ప్రదర్శన కనబర్చిన విషయం తెలిసిందే. 9 ఇన్నింగ్స్‌ల్లో 32 వికెట్లు తీసి ప్లేయర్ ఆఫ్ ది టోర్నీగా నిలిచాడు. విదేశాల్లో ఓ టెస్ట్ సిరీస్‌లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా నిలిచాడు. అయితే ఈ సిరీస్ ఆఖరి టెస్ట్‌లో బుమ్రా వెన్ను నొప్పితో బాధపడ్డాడు. ప్రస్తుతం ఈ గాయం తీవ్రత ఎక్కువగా ఉందని, ఛాంపియన్స్ ట్రోఫీ లీగ్ మ్యాచ్‌లకు అతను దూరంగా ఉండే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. ఫిబ్రవరి 19 నుంచి ఛాంపియన్స్ ట్రోఫీ ప్రారంభమవ్వగా.. భారత్ -పాక్ మ్యాచ్ ఫిబ్రవరి 23న జరగనుంది.

### యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్

# కెప్టెన్‌గా అవకాశం?



భవిష్యత్తులో టీమిండియా టెస్ట్ కెప్టెన్‌గా యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్ బాధ్యతలు తీసు కుంటాడా? అంటే సోషల్ మీడియా వేదికగా అవుననే సమాధానం వినిపిస్తోంది. ఆస్ట్రేలియా పర్యటనలో టీమిండియా దారుణంగా విఫలవడంతో జట్టును పూర్తిగా ప్రక్షాళన చేయాలనే డిమాండ్ వ్యక్తమవుతోంది. ముఖ్యంగా సీనియర్ క్రికెటర్లకు వీడ్కోలు పలికి యువ ఆటగాళ్లకు అవకాశాలు ఇవ్వాలని అభిమానులు, మాజీ క్రికెటర్లు సూచిస్తున్నారు.కెప్టెన్ రోహిత్ శర్మ, స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ, ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా రిటైర్మెంట్ ప్రకటిస్తారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రోహిత్ శర్మ అయితే ఆసీస్ పర్యటనలోనే రిటైర్మెంట్ ప్రకటిస్తాడని కూడా ప్రచారం జరిగింది. కానీ ఆ వార్తలను అతను ఖండించాడు. అయితే ఆదివారం ఆసీస్ పర్యటనపై బీసీసీఐ నిర్వహించిన సమీక్ష సమావేశానికి రోహిత్ శర్మ హాజరయ్యాడు. మరికొంత కాలం టెస్ట్‌ల్లో కెప్టెన్‌గా కొనసాగుతానని, ఆలోపు కొత్త కెప్టెన్ ఎంపికపై కసరత్తు చేయాలని సూచించినట్లు వార్తలు వచ్చాయి. టీమిండియాకు మరో 6 నెలల పాటు టెస్ట్ సిరీస్‌లు లేవు. ఫిబ్రవరిలో ఛాంపియన్స్ ట్రోఫీ జరగనుండగా.. అనంతరం ఐపీఎల్ ప్రారంభం కానుంది. జూన్‌లో టీమిండియా ఐదు టెస్ట్‌ల సిరీస్ కోసం ఇంగ్లండ్ పర్యటనకు వెళ్లనుంది. ఈ సిరీస్‌లో రోహిత్ శర్మనే కెప్టెన్‌గా కొనసాగుతాడనిపిస్తోంది. రోహిత్ వారసుడిగా బుమ్రాకు సారథ్య బాధ్యతలు కట్టబెట్టడంపై ఏకాభిప్రాయం కుదరట్లేదని తెలుస్తోంది. బుమ్రా తరుచూ ఫిట్‌నెస్ సమస్యలతో బాధపడుతుండటంతో అతని కెరీర్ ఎంత కాలం పొడిగించుకోగలడన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఈ క్రమంలోనే భవిష్యత్తు సారథి ఎవరా అనేది కూడా ఈ సమావేశంలో బీసీసీఐ చర్చించినట్లు తెలుస్తోంది. బుమ్రాకు కెప్టెన్సీ ఇస్తే వర్క్ లోడ్ ఎక్కువవుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ క్రమంలోనే సెలెక్షన్ కమిటీ రిషభ్ పంత్ పేరును ఫ్యూచర్ కెప్టెన్‌గా ప్రతిపాదించిందని సమాచారం. అయితే గంభీర్ అనూహ్యంగా యశస్వి జైస్వాల్ పేరు ప్రతిపాదించాడట. ఇప్పటి వరకు అయితే ఈ విషయంలో ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. గంభీర్ సూచనలను సెలెక్షన్ కమిటీ పట్టించుకుంటుందా లేదా అనేది కాలమే నిర్ణయించాలి. యశస్వి జైస్వాల్ ఓపెనర్‌గా టెస్ట్‌ల్లో అదరగొడుతున్నాడు.

# బుమ్రా, శుభ్‌మన్ గిల్, రిషభ్ పంత్‌కు విశ్రాంతి

- ఫేసర్ మహ్మద్ షమీకి జట్టులో చోటు
- ఇంగ్లాండ్‌తో టీ20 సిరీస్‌కు భారత్ జట్టు ప్రకటన




ఇంగ్లండ్‌తో టీ20 సిరీస్‌కు ప్రకటించిన భారత జట్టులో ఫేసర్ మహ్మద్ షమీ చోటు దక్కించుకున్నాడు. ఇంగ్లాండ్‌తో ఈ నెల 22 నుంచి జరగనున్న ఐదు టీ20ల సిరీస్‌కు భారత్ జట్టును బీసీసీఐ శనివారం రాత్రి ప్రకటించింది. 2023 నవంబర్‌లో వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచ్‌లో కుడి కాలు మడమకు గాయం కారణంగా షమి జట్టుకు దూరమయ్యాడు. 14 మాసాల విరామం తర్వాత ఇప్పుడు షమి జట్టులోకి రీఎంట్రీ ఇవ్వడం విశేషం. నితీష్ కుమార్ రెడ్డి, ధ్రువ్ జురెల్‌కు కూడా జట్టులో చోటు కల్పించారు. భారత జట్టుకు సూర్య కుమార్ యాదవ్ సారథ్యంవహించనున్నాడు. అక్సర్ పటేట్‌ను వైస్ కెప్టెన్‌గా నియమించారు. ముందుగా ఊహించినట్లుగానే స్టార్ పేసర్లు జస్‌ప్రీత్ బుమ్రా, సిరాజ్‌కు విశ్రాంతి కల్పించారు. అలాగే రిషభ్ పంత్, యశస్వి జైశ్వాల్, శుభ్‌మన్ గిల్‌కు కూడా విశ్రాంతి కల్పించారు. అజిత్ అగార్కర్ నేతృత్వంలో ముంబైలోని స్టార్ హోటల్‌లో జరిగిన బీసీసీఐ సెలక్షన్ కమిటీ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ఇంగ్లండ్ %-% భారత్ మధ్య టీ20 సిరీస్‌లో తొలి మ్యాచ్ కోల్‌కతాలోని ఈడెన్ గార్డన్ మైదానంలో జనవరి 22న జరగనుంది. ఐదు టీ20 మ్యాచ్‌ల సిరీస్ పూర్తయిన తర్వాత భారత్ %-% ఇంగ్లండ్ జట్ల మధ్య మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్ జరగనుంది. ఇంగ్లాండ్‌తో వన్డే సిరీస్ ముగిసిన వారంలోజుల్లోనే కీలకమైన ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ ప్రారంభం కానుంది.టీమిండియా: సూర్యకుమార్ యాదవ్ (కెప్టెన్), సంజూ శాంసన్ (వికెట్ కీపర్), అభిషేక్ శర్మ, తిలక్ వర్మ, హార్దిక్ పాండ్య, రింకూ సింగ్, నితీశ్ కుమార్ రెడ్డి, అక్షర్ పటేల్(వైస్ కెప్టెన్), హర్షిత్ రాణా, అర్షదీప్ సింగ్, మహ్మద్ షమీ, వరుణ్ చక్రవర్తి, రవి బిష్ణోయ్, వాషింగ్టన్ సుందర్, ధ్రువ్ జురెల్(వికెట్ కీపర్).

# 8 ఏళ్ల తర్వాత టీమిండియాలోకి రీఎంట్రీ?



దేశవాళీ టోర్నీ విజయ్ హజారే ట్రోఫీలో ఆడుతున్న పలువురు స్టార్ ప్లేయర్లు త్వరలో ఇంగ్లండ్‌తో జరిగే టీ20 సిరీస్‌లోనూ తమదైన ముద్ర వేయనున్నారు. అయితే, ఈ టోర్నమెంట్‌లో వరుసగా నాలుగు సెంచరీలతో సహా మొత్తం 5 సెంచరీలు చేసిన ఆటగాడు కూడా ఉన్నాడు. అయినప్పటికీ అతనికి టీమిండియాలో అవకాశం లభించలేదు. ఈ ఆటగాడి పేరు కరుణ్ నాయర్. వన్డే, టీ-20 జట్టులో అతను చోటు దక్కించుకోలేకపోయాడు. అయితే, అతనికి అర్హమైన భారత టెస్ట్ జట్టులో అతను ఖచ్చితంగా అవకాశం పొందాలని నమ్ముతున్నాడు. విజయ్ హజారే ట్రోఫీలో నిలకడగా రికార్డు బద్దలు కొట్టిన తర్వాత, నాయర్ బీసీసీఐ, టీమిండియా తలుపులు తట్టాడు. కరుణ్ నాయర్ టీమిండియా తరపున ఆడాడు. అతను చివరిసారిగా 2017లో టీమిండియా తరపున ఆడాడు. అయితే, ఇప్పుడు టెస్ట్ క్రికెట్‌లో టీమిండియా మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఇలాంటి తరుణంలో, జట్టుకు కరుణ్ నాయర్ లాంటి బ్యాట్స్‌మెన్ అవసరం. ఇటీవల ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌లపై టీమిండియా ప్రదర్శన చాలా అవమానకరంగా ఉంది. జట్టు బ్యాటింగ్‌లో డెప్త్ ఉన్నప్పటికీ.. బ్యాట్స్‌మెన్ ఫ్లాప్ అయ్యారు. రోహిత్, విరాట్ లాంటి పెద్ద దిగ్గజాలు కూడా పరుగులు చేయలేదు. ఇలాంటి తరుణంలో దేశవాళీ క్రికెట్‌లో సెంచరీల మీద సెంచరీ చేస్తున్న కరుణ్ టీమ్ ఇండియాకు ఊరట కలిగించవచ్చు. అయితే, అతని అదృష్టానికి సెలక్టర్ల మద్దతు కావాల్సి ఉంటుంది. నాయర్ టీమిండియాకు తిరిగి రావాలని తహతహలాడుతున్నాడు. డిసెంబర్ 2022లో, అతను సోషల్ మీడియాలో 'డియర్ క్రికెట్, నాకు మరో అవకాశం ఇవ్వండి' అంటూ ఒక పోస్ట్‌లో రాసుకొచ్చాడు విజయ్ హజారే ట్రోఫీలో కరుణ్ నాయర్ తన బ్యాట్‌తో విధ్వంసం సృష్టించాడు. వన్డే ఫార్మాట్‌లో జరుగుతున్న ఈ దేశవాళీ టోర్నీలో కరుణ్ నిన్న (జనవరి 12) మరో సెంచరీ (122 పరుగులు) సాధించాడు. ఈ సీజన్‌లో ఇప్పటివరకు వరుసగా 4 సెంచరీలతో కలిపి మొత్తం 5 సెంచరీలు సాధించాడు. అంతకుముందు, అతను జనవరి 3న యూపీపై 112, డిసెంబర్ 31న తమిళనాడుపై 111, డిసెంబర్ 28న చండీగఢ్‌పై 163, డిసెంబర్ 26న ఛత్తీస్‌గఢ్‌పై 44 నాటౌట్, జమ్మూ %ఒ% కాశ్మీర్‌పై 112 పరుగుల అజేయ ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. టెస్టు క్రికెట్‌లో రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ లాంటి దిగ్గజాలు కూడా చేయలేని ఫీట్ కరుణ్ నాయర్ సాధించాడు. నాయర్ తన కెరీర్‌లో 6 టెస్టులు ఆడాడు. అతను చివరిసారిగా 2017లో టీమిండియా తరపున మైదానంలోకి వచ్చాడు.

# కొత్త కెప్టెన్సీపై కోచ్, చీఫ్ సెలక్టర్ మధ్య విభేదాలు

## నూతన సారథి ఎవరనే విషయంపై తీవ్రంగా చర్చ

టీమిండియా కొత్త కెప్టెన్ ను ఎంపిక చేసే విషయంలో ప్రధాన హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్, చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ మధ్య విభేదాలు వచ్చినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఈ విషయం క్రికెట్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. రోహిత్ శర్మ తర్వాత అతడి వారసుడిగా బుమ్రాకు పూర్తి స్థాయి కెప్టెన్సీ బాధ్యతలు అప్పగిస్తారని మొదట ప్రచారం సాగింది. కానీ తాజా రివ్యూ మీటింగ్ లో... బుమ్రా తరచుగా గాయలబారిన పడుతుండటం వల్ల అతడిని ఎంపిక చేసే విషయమై కొంతమంది విముఖత చూపారట. దీంతో అతడికి వైస్ కెప్టెన్ బాధ్యతలు అప్పగించాలని అనుకుంటున్నారట. ఈ క్రమంలోనే లాంగెస్ట్ ఫార్మాట్ లో కెప్టెన్ గా రిషభ్ పంత్, కేఎల్ రాహుల్ పేర్లను పరిశీలిస్తున్నారని ప్రచారం మొదలైంది. అయితే ఇదే సమయంలో కెప్టెన్ ఎంపిక విషయమై అగార్కర్ రిషభ్ పంత్ పేరును సూచింగగా, గంభీర్ యంగ్ ఓపెనర్ యశస్వి జైశ్వాల్ పేరును సూచించాడని తెలిసింది. ఇప్పుడు ఇదే అంశం అగార్కర్, గంభీర్ నేతృత్వంలోని సెలక్టర్స్, కోచింగ్ స్టాఫ్ మధ్య విభేదానికి దారీ తీసిందని ఇంగ్లీష్ మీడియాలో కథనాలు వస్తున్నాయి. టెస్ట్ కెప్టెన్సీతో పాటు వన్డే కెప్టెన్సీపై కూడా చర్చలు సాగుతున్నాయట.

టీ20 కెప్టెన్ గా ఉన్న సూర్యకుమార్ యాదవ్ నే వన్డే కెప్టెన్ గా ఎంపిక చేయాలనే వాదనలు వినిపిస్తున్నాయట. కానీ వన్డేల్లో సూర్యకుమార్ ఆశించిన స్థాయిలో ప్రదర్శన చేయట్లేదని, అందుకే సూర్యకు వన్డేల బాధ్యతను అప్పగించడం సరికాదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయని సమాచారం అందింది.



## క్రేజీ బ్యూటీ కాళ్లు
# పట్టి లాగుతున్నారు



రంగుల ప్రపంచం ఒక పాము నిచ్చెనల ఆట. ఈ ఆటలో ఎవరు బాగా ఆడగలరో ఎవరూ నిర్ణయించలేరు. కొన్నిసార్లు కాలం నిర్ణయిస్తుంది. ప్రతిభ, లక్ కలిసొస్తే కొందరు స్టార్లు తమకు నచ్చిన విధంగా ఆడగలరు. కానీ ఎవరు ఎంతగా ఆడినా ఎదిగేవాళ్లను కాళ్లు పట్టి లాగే పాముల్ని సమర్థంగా ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఇప్పుడు అలాంటి ఒక దశలో ఉంది త్రిప్తి దిమ్రీ. ఈ బ్యూటీ ఏడెనిమిదేళ్లుగా పరిశ్రమలో ఉన్నా రణబీర్ లాంటి పెద్ద హీరోతో యానిమల్ లో నటించాకే తనకు పరిస్థితులు అనుకూలంగా మారాయి. యానిమల్ బ్లాక్ బస్టర్ అవ్వడం, ఆ చిత్రంలో తన పాత్రకు గుర్తింపు దక్కడంతో వరుసగా అరడజను పైగానే సినిమాలకు ఈ బ్యూటీ సంతకాలు చేసింది. వీటిలో కొన్ని సెట్స్ పై ఉన్నాయి. ఆషిఖి 3, ధడక్ 2 లాంటి సీక్వెల్ చిత్రాల్లో త్రిప్తీ నటిస్తోంది. ఒకవేళ ఈ రెండు సినిమాలు విజయం సాధిస్తే తన రేంజ్ మరింతగా ఎదుగుతుంది. కానీ ఇంతలోనే ఈ బ్యూటీ కాళ్లు పట్టి లాగేవాళ్లు రకరకాలుగా ప్రచారం చేస్తున్నారు. ముఖ్యంగా ఆషిఖి 3 నుంచి ఈ భామ వైదొలిగిందని ఒక పుకార్ షికార్ చేసింది. ఇది ఎదిగే సమయంలో నెగెటివ్ ప్రచారం. దీనివల్ల చాలా డ్యామేజ్ జరుగుతుంది. కానీ అదృష్టవశాత్తూ దర్శకుడు అనురాగ్ బసు దీనిని ఖండించారు. తన పాత్రను దాచడం వల్ల అంతగా పబ్లిసిటీ రాలేదని కూడా అన్నారు. ఆషిఖి 3 ఈ ఏడాదిలోనే విడుదల కానుంది. అలాగే ధడక్ 2లోను త్రిప్తీ నటిస్తోంది. వీటితో పాటు త్రిప్తీకి ఇతర ఆఫర్లు ఉన్నాయి. కానీ నెగెటివ్ ప్రచారం కారణంగా కొన్నిసార్లు పెద్ద డ్యామేజ్ జరిగే అవకాశం ఉంది. కానీ దీనిని యువనటి సమర్థంగా తిప్పి కొడుతుందేమో చూడాలి.

# ఈ క్షణాలు మరిచిపోను
## దుబాయ్‌లో అజిత్‌కుమార్




కోలీవుడ్‌లో మల్టీ టాలెంటెడ్ స్కిల్స్ ఉన్న యాక్టర్లలో టాప్‌లో ఉంటాడు అజిత్‌కుమార్. ఈ స్టార్ యాక్టర్ సినిమాలతో కోట్లాది మంది అభిమానులకు వినోదాన్ని అందించడమే కాదు తన రేసింగ్ స్కిల్స్‌తో యావత్ భారతదేశ గొప్పతనాన్ని మరోసారి ప్రపంచానికి చాటి చెప్పాడు. దుబాయ్ 24 సిరీస్‌లో భాగంగా అజిత్ కుమార్ టీం జరిగిన ఎండ్యూరెన్స్ రేసు లో పాల్గొన్న విషయం తెలిసిందే. ఈ రేసింగ్‌లో అజిత్ కుమార్ టీం పోర్చే 992 కేటగిరీలో 3వ స్థానంలో నిలువగా.. దుబాయ్ 24 సిరీస్‌లో 23వ ప్లేస్‌ను కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా అజిత్ కుమార్ రెపరెపలాడుతున్న మువ్వన్నెల జాతీయ జెండాను పట్టుకొని గ్యాలరీవైపుకు ఆనందంతో పరుగెత్తుకొచ్చాడు. అందరికీ భారత జెండాను చూపిస్తూ దేశమంతా గర్వించేలా చేశాడు. ఇప్పుడీ వీడియో నెట్టింట వైరల్ అవుతోంది. కార్ రేసింగ్‌లో టాప్ ప్లేస్‌లో నిలిచిన అజిత్ కుమార్ టీంకు అభిమానులు, ఫాలోవర్లు, రేసింగ్ లవర్స్ శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. కొన్ని రోజులుగా దుబాయ్ కార్ రేసింగ్ కోసం ప్రాక్టీస్ సెషన్‌లో పాల్గొంటుడగా అజిత్ కారు ట్రాక్‌ను ఢీకొట్టి పల్టీలు కొట్టడంతో భారీ ప్రమాదం తప్పింది. స్వల్ప గాయాలతో బయటపడ్డ అజిత్ కుమార్ తన టీంతో కలిసి ఏ మాత్రం తగ్గేదేలా అంటూ సత్తా చూపించి టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా నిలిచాడు.

# డాకు మహారాజ్‌కు మొదటి డే వసూల్ ఎంతో తెలుసా..?

నందమూరి బాలకృష్ణ అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురు చూసిన డాకు మహారాజ్ థియేటర్లలో సందడి చేస్తోంది. బాబీ దర్శ కత్వంలో ఎన్‌బీకే 109గా తెరకెక్కిన ఈ మూవీ జనవరి 12న (ఆదివారం) ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కాగా సూపర్ హిట్ టాక్‌తో స్క్రీనింగ్ అవుతోంది. కాగా వరల్డ్ వైడ్‌గా ఓపెనింగ్ డేన డాకు మహారాజ్ రూ.56 కోట్లు వసూళ్లు రాబట్టింది. బాలకృష్ణ కెరీర్‌లోనే ఇది బిగ్గెస్ట్ ఓపెనింగ్ కావడం విశేషం.డాకు మహారాజ్ సంక్రాంతి బ్లాక్ బస్టర్స్‌లో ఒకటిగా నిలువడం ఖాయమని తాజా ఫిగర్ క్లారిటీ




ఇచ్చేస్తుంది. మరి రాబోయే రోజుల్లో బాలకృష్ణ వసూళ్ల పర్వం ఎలా ఉండబోతుందనేది ఆసక్తికరంగా మారింది. ఈ మూవీలో బాలీవుడ్ డ్యాన్సింగ్ క్వీన్ ఊర్వశి రౌటేలా, ప్రగ్యా జైశ్వాల్ ఫీ మేల్ లీడ్ రోల్స్‌లో నటించగా.. రోనిత్ రాయ్, శ్రద్దా శ్రీనాథ్, చాందినీ చౌదరి ఇతర కీలక పాత్రలు పోషించారు. ఈ చిత్రంలో బాలీవుడ్ యాక్టర్ బాబీ డియోల్ విలన్‌గా నటించాడు. ఈ మూవీని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమా బ్యానర్లపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా తెరకెక్కించారు.

# దావూది పాటకు ఎన్టీఆర్‌ను దించేసిన బుడ్డోడు
## ఇంప్రెస్ అయిన తారక్



సోషల్ మీడియాలో చిన్నారుల డ్యాన్స్ వీడియోలు తరచూ చూస్తూనే ఉంటాం. అయితే కొన్ని వీడియోలు మాత్రం నెటిజన్లను కట్టిపడేస్తుంటాయి. అలాంటి వీడియోనే ఒకటి నెట్టింట రౌండప్ చేస్తోంది. తారక్ నటించిన దేవర సినిమాలోని దావూది సాంగ్ ఏ రేంజ్‌లో ఫేమస్ అయ్యిందో తెలిసిందే. అనిరుధ్ రవిచందర్ కంపోజ్ చేసిన ఈ పాట మిలియన్ల సంఖ్యలో వ్యూస్‌తో టాప్ ట్రెండింగ్‌లో నిలిచింది. అయితే ఇదే పాటకు ఓ స్కూల్ ఈవెంట్‌లో ప్లే చేశారు. చిన్నారులంతా కలిసి డ్యాన్స్ చేయగా.. అందులో ఉన్న ఓ బుడ్డోడు మాత్రం దావూది సాంగ్‌కు చాలా స్టైలిష్‌గా డ్యాన్స్ చేసి ఔరా అనిపిస్తున్నాడు. విద్యార్థులంతా దావూది స్టెప్పులేస్తుంటే అందులో ఉన్న ఓ చిన్నోడు.. మధ్యలో ఉన్న బుడ్డోడికి బ్లాక్ గాగుల్స్ ఇచ్చాడు. ఇంకేంటి ఆ గాగుల్స్ పెట్టాక మరింత చెలరేగిపోయాడు. ఈ వీడియో నెటిజన్లను కట్టిపడేస్తుంది. ఇక ఈ వీడియో తారక్ కంటపడటంతో ఇంప్రెస్ అయ్యాడు. బుడ్డోడి డ్యాన్స్ చాలా ముద్దుగా ఉందంటూ రిప్లై ఇచ్చాడు తారక్. ఇప్పుడీ వీడియోతోపాటు తారక్ ఇచ్చిన రిప్లై నెట్టింట హల్ చల్ చేస్తోంది.

## ఆ రోజులను గుర్తు చేసుకున్న
# అల్లు అర్జున్
### 'అల వైకుంఠపురములో' సినిమాకు ఐదేళ్లు




అల్లు అర్జున్ హీరోగా నటించిన చిత్రం 'అల వైకుంఠపురములో'. త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో కూపొందిన ఈ చిత్రంలో పూజా హెగ్డే కథానాయిక. అల్లు అరవింద్, రాధాకృష్ణ సంయుక్తంగా నిర్మించారు. వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన మూడో చిత్రం బ్లాక్‌బస్టర్ హిట్‌గా నిలిచింది. 2020లో సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకొచ్చిన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని సొంతం చేసుకుంది. ఈ సినిమా వచ్చి ఐదేళ్లు పూర్తి కావడంతో అల్లు అర్జున్ ఆ రోజులను గుర్తు చేసుకున్నారు. ఈ చిత్రం నా హృదయంలో ఎప్పటికీ ప్రత్యేక స్థానాన్ని కలిగి ఉంటుందని పోస్ట్ చేశారు. సినిమా థియేటర్లు ఇంతటి ఘన విజయాన్ని అందించిన త్రివిక్రమ్, చినబాబు, అల్లు అరవింద్, తమన్‌కు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ అద్భుతమైన చిత్రానికి జీవం పోసిన నటీనటులు, సిబ్బందితో పాటు మీ అందరి ప్రేమకు కృతజ్ఞతలు అంటూ ట్విటర్‌లో పోస్ట్ చేశారు. ఈ మూవీ సమయంలో దిగిన ఫోటోలను షేర్ చేశారు. ప్రస్తుతం బన్నీ చేసిన పోస్టర్ వైరల్‌గా మారింది.